నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నిజామాబాద్-కామారెడ్డి

బుధవారం | నవంబర్ 06, 2024 | www.navatelangana.com

వైద్య ఆరోగ్యశాఖలో కాంట్రాక్ట్ పద్ధతిలో పోస్టుల భర్తీకి దరఖాస్తులకు ఆహ్వానం

నవతెలంగాణ-కంఠేశ్వర్

వైద్యారోగ్యశాఖలో కాంట్రాక్ట్ పద్ధతిలో పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు నిజామాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని రాజశ్రీ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేషనల్ హెల్త్ మిషన్ కింద కాంట్రాక్ట్ పద్ధతిలో 13 మిడ్లెవల్ హెల్త్ ప్రొవైడర్ పోస్టులను భర్తీ చేస్తున్నామని తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 6వ తేది నుంచి 9వ తేదీలోపు కలెక్టర్ కార్యాలయంలోని డీఎంహెచ్వో ఆఫీస్ నంబర్ 202లో అందజేయాలని సూచించారు. దరఖాస్తులను nizamabad.telangana.gov.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు.

రైతులే కాడెడ్లుగా ఎడ్లబండిపై ట్రాన్స్‌ఫార్మర్ తరలింపు

నవతెలంగాణ-వేల్పూర్



బండిని లాగుతున్న రైతులు

చెడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌ను తరలించేందుకు రైతులు అష్టకష్టాలు పడాల్సి వస్తుంది. పొలాల మధ్యలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను మరమ్మతుల కోసం తరలించేందుకు రైతులే కాడేడ్లుగా మారి ఎడ్లబండిపై తరలించిన ఘటన నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలంలోని కొత్తపల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. ప్రభుత్వాలు మారినా కానీ తమ గోడు మాత్రం తీర్చేవారు లేరని వాపోతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ రోడ్డు పక్కన కాకుండా.. పొలాల మధ్యలో ఏర్పాటు చేయడంతో మరమ్మతులు నోచుకున్న ప్రతిసారీ దాన్ని తీసుకెళ్లి తీసుకురావడం పెద్ద సమస్యగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి తమ సమస్యను తీర్చాలని రైతులు కోరుతున్నారు.

ప్రయాణం.. ప్రాణసంకటం

- సరిపడా బస్సులు లేక విద్యార్థులకు ఇక్కట్లు
- వేలాడితేనే.. గమ్యస్థానాలకు చేరుకోవాల్సిన దుస్థితి
- బస్సుల సంఖ్య పెంపుపై దృష్టిపెట్టని పాలకులు, ఆర్టీసీ

నవతెలంగాణ-కంఠేశ్వర్





ఫులాంగ్ మీదుగా బాసర-భైంసా వెళ్తున్న బస్సులో ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న విద్యార్థులు.. ఆర్మూర్ వైపు వెళ్లే రూట్‌లో..

ఆర్టీసీ ఒక వైపు ఫుడ్ బోర్డు ప్రయాణం ప్రమాదకరం అని ప్రచారం చేస్తూనే మరో వైపు ఫుడ్‌బోర్డు ప్రయాణాన్ని ప్రోత్సహిస్తున్నట్టవుతుంది. ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా బస్సులు లేక బస్సులన్నీ కిక్కిరిసి వెళ్తున్న విషయం విధితమే. ఈ నేపథ్యంలో ఇతర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రానికి, జిల్లా కేంద్రం నుంచి ఇతర ప్రాంతాల్లో ఉన్న స్కూళ్లకు, కాలేజీలకు వెళ్లేందుకు విద్యార్థులకు ఇక్కట్లు మాత్రం తప్పడం లేదు. ఉదయం వేళ.. బస్సులన్నీ కిక్కిరిసి ఉండటంతో గత్యంతరం లేక ప్రమాదకరంగా ఫుట్‌బోర్డుమీద వేలాడుతూ ప్రయాణం చేస్తున్నారు. ఒక వేళ బస్సు సడెన్ బ్రేక్ వేస్తే పెనువిషాదం చోటుచేసుకునే అవకాశం ఉంది.

మహాలక్ష్మి పథకంతో బస్సుల్లో ప్రయాణికుల రద్దీ పెరిగిన విషయం తెలిసింది. అందుకుతగ్గట్టు బస్సుల సంఖ్య పెంచాలని అన్ని వైపుల నుంచి డిమాండ్‌లు వస్తున్నా.. ఆర్టీసీ అధికారులు, పాలకులు పట్టనట్టు వ్యవహరిస్తున్నట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కాగా స్కూళ్లకు, కాలేజీలకు వెళ్లే విద్యార్థులకు మాత్రం మరంత ఇక్కట్లు పడుతున్నారు. జిల్లా కేంద్రం నుంచి ఆర్మూర్, బోధన్, డిచ్‌పల్లి, బాన్సువాడ వైపు ఉన్న కాలేజీలకు, స్కూళ్లకు పలువురు విద్యార్థులు వెళ్తుండగా.. ఇతర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రంలో చదువుకునేందుకు సైతం రోజు వేలాది మంది విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రస్తుతం బస్సులు కిక్కిరిసి ఉండటంతో స్కూళ్లకు, కాలేజీలకు వెళ్లాలనే తాపత్రయంతో విద్యార్థులు ఇలా ప్రమాదకరంగా ఫుట్‌బోర్డుపై ప్రయాణం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, ఆర్టీసీ స్పందించి ప్రయాణికులకు అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచాలని కోరుతున్నారు.

గతంలో పలు ప్రమాదాలు

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో కంఠేశ్వర్ ప్రాంతంలో గతంలో ఆర్మూర్ వైపు కాలేజీకి వెళ్తున్న విద్యార్థులు ఫుట్‌బోర్డుపై ప్రయాణం చేస్తుండగా.. బస్సు సడెన్ బ్రేక్ వేయడంతో విద్యార్థి బస్సు టైర్ కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. అదేవిధంగా ఆర్మూర్ రోడ్‌లో గల లక్ష్మీ ప్రియ నగర్ కాలనీ వద్ద ఓ బస్సు సడన్ బ్రేక్ వేయడంతో వెనుక టైర్ కింద పడి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. ఇలాంటి ప్రమాదాలు జరగకముందే అధికారులు మేల్కొని బస్సుల సంఖ్యను పెంచాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రబీ పంటలకు సాగునీటికి ఢోకాలేదు

- ఎస్సారెస్పీ ఎస్ఈ శ్రీనివాస్‌రావు గుప్త
- ప్రాజెక్టుకు 278 టీఎంసీల నీరు వచ్చి చేరగా.. ఎప్పటికప్పుడు దిగువకు విడుదల చేసినట్టు వెల్లడి

నవతెలంగాణ-మెండోరా



మాట్లాడుతున్న ప్రాజెక్టు ఎస్ఈ శ్రీనవాస్‌రావుగుప్త

జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు రిజర్వాయర్‌లోకి ఈ సీజన్లో ఎగువ ప్రాంతాల నుంచి 278 టీఎంసీల వరద నీరు వచ్చి చేరిందని ఎస్సారెస్పీ సూపరింటెంట్ ఇంజనీర్ శ్రీనివాసరావు గుప్తా తెలిపారు. రబీ సీజన్‌లో పంటలకు సాగునీటి ఢోకా లేదని తెలిపారు. పోచంపాడ్‌లోని నీటిపారుదల శాఖ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఖరీఫ్ పంటల ప్రారంభ దశలో ప్రాజెక్టులో నీటిమట్టం తక్కువగా ఉన్నా ఉన్నత అధికారుల ఆదేశానుసారం నీటి విడుదల ప్రారంభించామన్నారు. వర్షాకాలం సీజన్ ప్రారంభమైనా వర్షాలు తక్కువ కురుస్తుండడంతో ప్రాజెక్టు లోకి నీరు వస్తుందో లేదో అని ఆందోళన చెందామన్నారు. సెప్టెంబర్ మొదటి మాసంలో కురిసిన అధిక వర్షాలతో ప్రాజెక్టు నిండిపోవడం ప్రారంభించిందన్నారు. వరదలు అధికంగా వస్తున్న సమయంలో ఎస్సారెస్పీ అధికారులు సిబ్బంది అనునిత్యం, అనుక్షణం అప్రమత్తంగా ఉండి ప్రాజెక్టు గేట్ల నిర్వహణ చేపట్టినట్టు తెలిపారు.

ప్రాజెక్ట్ ఎగువన దిగువన ఉన్న గ్రామాలకు గాని ప్రజలకు కానీ పంటలకు గాని ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారని గుర్తు చేశారు.ఈ సందర్భంగా అధికారులకు సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. వరదలు ఎక్కువగా రావడంతో గోదావరిలోకి 117 టీఎంసీల నీటిని వరద గేట్లు, ఎస్కే గేట్ల ద్వారా వదిలేశామన్నారు. కాకతీయ కాలువకు 34 టిఎంసిలు, వరద కాలువకు 40 టీఎంసీలు, సరస్వతి కాలువకు 2.5 టిఎంసిలు, మిషన్ భగీరథ తాగునీటి కొరకు 3.4 టీఎంసీలు, లక్ష్మీకాలకు 0.17 టీఎంసీల నీటిని విడుదల చేశామన్నారు. ఆవిరి రూపంలో 6.7 టీఎంసీల నీరు పోయిందన్నారు. అదేవిధంగా ప్రస్తుతం ప్రాజెక్టు 1091 అడుగులు 80.5 టీఎంసీ లతో నిండుకుండలా ఉందన్నారు. దీంతో రబీ పంటలకు కూడా సాగు నీటికి ఢోకా లేదన్నారు. రబీ పంటలకు ఎటువంటి సందేహం లేకుండా రైతులు సిద్ధం కావాలని రబీ పంటలకు సహితం పంటల చివరివరకూ సాగునీటిని అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సారెస్పీ ఈఈ చక్రపాణి , ప్రాజెక్టు అధికారులు పాల్గొన్నారు.

ముగ్గురి ప్రాణాలు కాపాడిన పోలీసులు

- భర్త వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకునేందుకు ఇద్దరు పిల్లలతో ఎస్సారెస్పీకి వెళ్లిన భార్య

నవతెలంగాణ-మెండోర

పోలీసుల తక్షణ స్పందన ముగ్గురి ప్రాణాలు నిలిపాయి. భర్త వేధింపులు తాళలేక.. ఆత్మహత్య చేసుకునేందుకని ఇద్దరు పిల్లలతో కలిసి వివాహిత ఎస్సారెస్పీకి వెళ్లింది. సమాచారం అందుకున్న పోలీసులు.. హుటాహుటిన అక్కడికి చేరుకొని ఆమెను నిలువరించి కౌన్సెలింగ్ ఇచ్చి ముగ్గురి ప్రాణాలు కాపాడారు. ఈ ఘటన ఎస్సారెస్పీ వద్ద మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల, పోలీసుల వివరాల ప్రకారం.. బాల్కొండ మండల కేంద్రానికి చెందిన కుందారపు స్రవంతి ఆమె భర్త అయిన కేదార్ గత కొన్ని సంవత్సరాలుగా వేధింపులకు పాల్పడుతున్నాడు. దీంతో తీవ్ర మనస్థాపం చెందిన ఆమె ఇద్దరు కుమారులను తీసుకొని ఆత్మహత్య చేసుకోవడానికి శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో దూకడానికి వెళ్లింద. గమనించిన స్థానికులు 100కు డయల్ చేసి మెండోర పోలీసులకు సమాచారం అందించారు. డ్యూటీలో ఉన్న వసీమ్, అన్వేష్ హుటాహుటిన స్రవంతి వద్దకు వెళ్లి వారికి కౌన్సెలింగ్ ఇచ్చి మెండోర పోలీసు స్టేషన్‌కు తీసుకువచ్చారు. అనంతరం ఆమె భర్త కేదార్‌తో పాటు వారి అమ్మ నాన్నలను పిలిపించి కుటుంబికులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం కుటుంబీకులతో పంపించారు.

నిత్యావసర ధరలు
అదుపు చేయలేని అసమర్థ ప్రభుత్వం

- కార్పోరేట్ కంపెనీలకు వత్తాసు పలుకుతున్న కేంద్ర ప్రభుత్వం
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు
- ఐక్యంగా ప్రజాపోరాటాలకు సిద్ధం కావాలని పిలుపు

నవతెలంగాణ-కంఠేశ్వర్



సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్‌బాబు

రోజురోజుకు నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని వాటిని అదుపు చేయలేయ కేంద్ర ప్రభుత్వం చేతులెత్తేయడంతో పాటు కార్పొరేట్ కంపెనీలకు వత్తాసు పలుకుతుందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు విమర్శించారు. ఫలితంగా పేద, మధ్యతరగతి ప్రజలు కడుదయనీయ పరిస్థితి ఎదుర్కొంటున్నారని అన్నారు. నగరంలోని నాందేవ్‌వాడలో గల సీపీఐ(ఎం) కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు పెరగకపోవటంతో ఆదాయాలు పడిపోతున్నాయని, దీంతో ప్రజల జీవన ప్రమాణాలు ఏ విధంగా పెరుగుతాయని ఆయన ప్రశ్నించారు. సమస్యలను ప్రశ్నిస్తే దేశద్రోహులుగా చిత్రీకరిస్తూ ప్రచారం చేస్తున్నారని అన్నారు. మరొకవైపు కార్పొరేట్ కంపెనీల ఆదాయాలు రోజురోజుకు పెరిగిపోతూ ప్రపంచంలోనే అత్యంత కుబేరులుగా తయారవుతున్నారని వీటి మూలంగా పేద, ధనిక వ్యత్యాసాలు పెరిగిపోయి సమాజంలో అంతరాలు పెరుతున్నాయని అన్నారు. ఈ వ్యత్యాసాలను తగ్గించడానికి ప్రజా సంక్షేమం కోసం నిధులను కేటాయించటంతో పాటు ఉపాధి అవకాశాలను పెంచటానికి, కార్మిక వర్గం వేతనాలు కనీస అవసరాలు తీర్చే విధంగా నిర్ణయించటానికి ఐక్య పోరాటాలకు సిద్ధపడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్, నాయకులు గణేష్, కార్తీక్, సందీప్ బుచ్చన్న, గంగారం నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నగదు రహిత వైద్యాన్ని అందించాలి

- డీఏలను విడుదల చేయాలని పెన్షనర్‌ల నిరసన



ధర్నాచౌక్‌లో ధర్నా చేపట్టి ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న పెన్షనర్‌లు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగదు రహిత వైద్యాన్ని అన్ని కార్పొరేట్, ప్రైయివేటు ఆసుపత్రులలో పెన్షనర్లకు ఉద్యోగులకు అనుమతించాలని, పెండింగ్‌లో ఉన్న డిఏలను తక్షణమే విడుదల చేయాలని, కమిటేషన్ 12 సంవత్సరాలకు కుదించాలని, తదితర పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ధర్నాచౌక్‌లో ధర్నా చేపట్టారు. నిజామాబాద్ అధ్యక్షులు శిర్ప హనుమాన్లు అధ్యక్షతన జరిగిన ఈ ధర్నా కార్యక్రమాన్ని అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కే. రామ్మోహన్‌రావు ప్రారంభించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల మేరకు పెండింగ్‌లో ఉన్న నాలుగు డిఏ లను విడుదల చేయాలని, పే రివిజన్ కమిషన్‌ను 40 శాతం ఫిట్‌మెంట్‌తో వెంటనే అమలు చేయాలని, లక్షలాది రూపాయల మెడికల్ బిల్లులు ఈ కుబేర్‌లో మూలుగుతున్నాయని, సంవత్సరాల తరబడి ప్రభుత్వానికి, సమాజానికి, ప్రజలకు, సేవలు అందించిన రిటైర్డ్ ఉద్యోగుల పట్ల ప్రభుత్వ వైఖరి మారాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం నూతన మున్సిపల్ కమిషనర్ ని కలిసి వెల్‌నెస్ సెంటర్‌కు అదనపు సౌకర్యాలు కల్పించాలని, వెల్నెస్ సెంటర్ పటిష్టపరిచేం దుకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మదన్ మోహన్, కోశాధికారి ఈవీఎల్ నారాయణ, జిల్లా నాయకులు ప్రసాద్ రావు, లావు వీరయ్య, లక్ష్మీనారాయణ, బన్సీలాల్, రాధా కిషన్, వి .వెంకటరావు, కృష్ణారావు, జ్ఞానేశ్వర్, హమీద్, తదితరులు పాల్గొన్నారు.

సర్వే పకడ్బందీగా చేపట్టాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



శిక్షణలో మాట్లాడుతున్న కలెక్టర్

నవతెలంగాణ-తాడ్వాయి

కుటుంబ సమగ్ర సర్వే సమర్థవంతంగా నిర్వహించాలని కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. మంగళవారం తాడ్వాయి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో కుటుంబ సమగ్ర సర్వే పై జరిగిన కార్యక్రమానికి హాజరై మాట్లాడుతూ సర్వేలో తప్పులు దొర్లకుండా చూడాలని గ్రామాల్లో ఎంపిక చేసిన ప్రతి ఇంటికి వెళ్లి సభ్యుల వివరాలు తదితర అంశాలను నమోదు చేసుకోవాలన్నారు. నమోదు చేసిన గృహాలకు స్టిక్కర్లు అతికించాలని నిత్యం ఎన్ని కుటుంబాల సర్వే చేశారో తెలుస్తుందని అన్నారు. ఈ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రాజారాం, మండల అభివృద్ధి అధికారి సయ్యద్ సాజిద్ అలీ,. తాసిల్దార్ రహీముద్దీన్. విద్యా శాఖ అధికారి రామస్వామి,ఏవో నర్సింలు ఏ పి ఎం మనోహర్, ఉపాధ్యాయులు, జీపీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు వేగవంతం చేయాలి

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని విక్రయించాలని కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వన్ రైతులకు సూచించారు. అదే విధంగా కొనుగోలు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. మంగళవారం మండలంలోని తాండూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల వద్ద సదుపాయాలను తాండూర్ సొసైటీ చైర్మన్ ఆకిడి గంగారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు చేయాలని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట ఆర్డిఓ ప్రభాకర్ తాసిల్దార్ శ్రీనివాసరావు ఉన్నారు.

డీఈవోకు వీడ్కోలు సన్మానం

నవతెలంగాణ కంఠేశ్వర్



డీఈవోను సన్మానిస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

నిజామాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గ ప్రసాద్ బదిలీ అయిన సందర్భంగా టీఎస్‌యూటీఎఫ్ మంగళవారం సన్మానించింది. యూటీఎఫ్ జిల్లా కమిటీ పక్షాన జిల్లా అధ్యక్షులు డి. సత్యానంద్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఓ. రమేష్ జిల్లా కార్యదర్శి వి. సాయన్న వీడ్కోలు పలికారు.

బాలోత్సవం.. చదువుల పండుగ

- విజయవంతం చేయండి : వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



మాట్లాడుతున్న రఘురాం

జనవిజ్ఞాన వేదిక, మల్లు స్వరాజ్యం మెమోరియల్ ట్రస్ట్, పెన్షనర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 12,13న మోపాల్‌లోని ప్రెసిడెన్సీ స్కూల్‌లో నిర్వహించనున్న బాలోత్సవం.. చదువుల పండుగను విజయవంతం చేయాలని తల్లిదండ్రులకు, విద్యార్థులకు, విద్యాసంస్థల యాజమాన్యాలకు వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు రఘురాం మాట్లాడుతూ విద్యార్థులలోని సృజనాత్మకతను వెలికితీయడం కోసం శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యమని ఈ కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నాలుగు మండలాల పరిధిలోని (నిజామాబాద్ నార్త్, సౌత్, మోపాల్, రూరల్) సంబంధించిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు తమలో ఉన్న సృజనాత్మక శక్తిని నిరూపించుకునేందుకు అనేక రకాల పోటీలలో పాల్గొనవచ్చని తెలిపారు. దీనికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేలు హాజరవు తున్నరని 12, 13 వ తేదీలలో ఉదయం తొమ్మిది గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు క్విజ్, వ్యాసరచన పోటీలు, ఇలాంటి అనేక కార్యక్రమాలు ఇందులో పొందుపరచారిని అందరు భాగస్వాములై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకునేం దుకు తమ పాఠశాలలో సంప్రదించాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విగ్నేష్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి డాక్టర్ కర్క గణేష్, ఏఐపీఎస్‌యూ జిల్లా కార్యదర్శి బోడ అనిల్, ఏఐఎఫ్‌డిఎస్ జాతీయ కన్వీనర్‌మె్రి మైత్రి.రాజశేఖర్, ఏఐపిఎస్‌యూ నగర కార్యదర్శి సందీప్, నాయకులు దినేష్, హర్షిత, నవీన్ కృష్ణ, చక్రి, శ్రీకాంత్, రఘు, కైలాస్ తదితరులు పాల్గొన్నారు.

చలికాలంలో పిల్లల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రముఖ పిల్లల వైద్యులు ఆనంద్ సామల



నవతెలంగాణ-ఆర్మూర్

చలికాలంలో చిన్న పిల్లల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని పట్టణానికి చెందిన ఆనంద్ పిల్లల వైద్యులు ఆనంద్ కుమార్ సామల తెలిపారు. మంగళవారం ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసి మాట్లాడారు. చలితీవ్రత పెరిగిన నేపథ్యంలో పిల్లల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. కూల్ డ్రింక్స్, చైనీస్, ఫాస్ట్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని, ఫ్రిడ్జ్ వాటర్ తాగించవద్దని, పాఠశాలల్లో సైతం తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా చలికాలంలో పిల్లలకు వేడినిచ్చే దుస్తులు చాలా అవసరమని, పిల్లలను చలి నుంచి కాపాడేందుకు స్వెట్టర్లు, మంకీ క్యాప్ లు, చేతులు, కాళ్లకు గ్లౌజులు వేయాలని సూచించారు. దోమల దరిచేరకుండా చూసుకోవాలని తెలిపారు.

మెట్లబావి చుట్టూ కాటేజీలు

- బావి పరిసరాల్లో చెత్తను తొలగించి మొక్కలు నాటి సంరక్షించాలి
- జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నవతెలంగాణ-లింగంపేట్



ధాన్యం తూకం పరిశీలిస్తున్న కలెక్టర్



మెట్లబావిని సందర్శించి సూచనలిస్తున్న కలెక్టర్

లింగంపేట మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో గల నాగన్న గారి మెట్ల బావిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడంలో భాగగా బావి చుట్టూ కాటేజీల నిర్మాణానికి ప్రతిపాదించాలని కలెక్టర్ జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వన్ అన్నారు. మంగళవారం చారిత్రక కట్టడమైనటువంటి మెట్ల బావిని సందర్శించారు. బావిలో ఉన్నటువంటి చెత్త చెదారం తొలగించాలని, పరిసరాల్లో మొక్కలు నాట సంరక్షించాలని సూచించారు. చారిత్రక కట్టడాలు చరిత్రలో నిలిచిపోతాయని భావితరాలకు గుర్తుండిపోతాయన్నారు. అనంతరం నాగన్న బావిని చూడడానికి వచ్చిన పాఠశాల విద్యార్థులతో ఆయన మాట్లాడారు. చారిత్రక కట్టడాలకు ప్రత్యేకత ఉందని అన్నారు. చారిత్రక కట్టడాలు వాటి చరిత్రలు విద్యార్థులకు ఎంతైనా అవసర పడతాయని అన్నారు. విద్యార్థులు మెట్ల బావి గురించి తెలుసుకోవాలన్నారు. రోజురోజుకు పర్యటకుల సందర్శన పెరుగుతుందని, ప్రత్యేక గుర్తింపు వస్తుందని అన్నారు.

కొనుగోలు కేంద్రం సందర్శన

మండలంలోని మేంగారం గ్రామ సమీపంలో వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడారు. వరి ధాన్యం సేకరణ వేగవంతం చేయాలని, రైతులకు సమస్యలు రాకుండా తక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. బస్తాల్లో నింపిన ధాన్యం ను సంబంధిత రైస్ మిల్లులకు తరలించాలని అన్నారు. రైతులకు సంబంధించిన వరి ధాన్యం సేకరణ, బ్యాంకు ఖాతా, తదితర వివరాలను ట్యాబ్ లో నమోదు చేయాలని అన్నారు. రైతులకు రెండు, మూడు రోజుల్లో చెల్లింపులు జరిగేవిధంగా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ ప్రభాకర్, జిల్లా గ్రామీణాభివద్ధి అధికారి సురేందర్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రాజేందర్, ఇన్చార్జి జిల్లా పౌర సరఫరాల అధికారి నరసింహ రావు, జిల్లా సహకార అధికారి రాం మోహన్, లింగంపేట్ సింగిల్ విండో చైర్మన్ దేవేందర్ రెడ్డి, స్థానిక తహసీల్దార్లు, నరేందర్, ఎంపీడీ నరేష్, వ్యవసాయ అధికారి అనిల్ కుమార్, సింగిల్ విండో కార్యదర్శి పెంటయ్య, లింగంపేట్ గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రావణ్ కుమార్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

కుల గణన సదస్సులో జిల్లా కాంగ్రెస్ నాయకులు


సదస్సులో పాల్గొన్న నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

హైదరాబాద్‌లో పీసీసీ అధ్యక్షులు, ఎంఎల్సి మహేష్ కుమార్ గౌడ్ అధ్వర్యంలో కుల గణన - సకల జనులకు ఆదరణ సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుటుంబ సర్వేపై కుల గణన సంప్రదింపుల సదస్సు మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జాతీయ కాంగ్రెస్ అగ్ర నాయకులు, ఎంపీ రాహుల్ గాంధీ పాల్గొన్న సదస్సులో నిజామాబాద్ జిల్లాకు చెందిన మాజీ మంత్రి, బోధన్ ఎంఎల్ఏ సుదర్శన్ రెడ్డి, రాష్ట్ర ఎండిసి చైర్మన్ ఈరవత్రి అనిల్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, రాష్ట్ర సహకారా యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి ,రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి , వితనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి, ఆర్మూర్ కో ఆర్డినేటర్ వినయ్ రెడ్డి, పాల్గొన్నారు.

సెపక్ తక్రా రాష్ట్ర ఉపాధ్యక్షునికి సన్మానం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



హైదరాబాద్ ఫాతే మైదాన్‌లో జరిగిన తెలంగాణ సెపక్ తక్రా రాష్ట్ర ఎన్నికలలో రాష్ట్ర ఉపధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డ జిల్లా సెపక్ తక్రా ప్రధాన కార్యదర్శి, జిల్లా ఒలింపిక్ సంఘ ఉపాధ్యక్షులు గాధరి సంజీవ్ రెడ్డిని జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు ఈగ సంజీవరెడ్డి శాలువాతో మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఒలింపిక్ అధ్యక్షులు మాట్లాడుతూ క్రీడాకారులకు మంచి శిక్షణ ఇచ్చి జిల్లా, రాష్ట్ర జట్లకు ప్రాతినిధ్యం వహించే విధంగా క్రీడాకారులను తయారు చేయాలని సూచించారు.

మెడికల్ షాపులో చోరీ

- సుమారు 5 లక్షల నగదు, డివిఆర్ మాయం


మెడికల్ షాప్‌ను పరిశీలిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని ఖలీల్ వాడి ప్రాంతంలో దొంగలు హల్చల్ చేశారు. మెడికల్ షాప్‌లో చోరీ చేసి సుమారు 5 లక్షల నగదు డివిఆర్ ఎత్తుకెళ్లినట్లు తెలిసింది. నిజామాబాద్ నగరంలో ఎక్కువగా రద్దీగా ఉండే ప్రాంతమైన సరస్వతినగర్‌లోని ఓక ప్రైవేట్ హాస్పిటల్ జాయింట్ మెడికల్ కౌంటర్‌లో చోరికి పాల్పడ్డారు. పాత అర్డిఓ కార్యాలయం ఎదురుగా గల ప్రసాద్ పిల్లల ఆసుపత్రి అనుబంధ వర్నియా పార్మసీలో సోమవారం రాత్రి దొంగలు చోరి చేశారు. షట్టర్ తాళాలు పగుల గొట్టి కౌంటర్‌లో ఉన్న 5 లక్షల నగదును చోరి చేశారు. చోరి జరిగిన ప్రాంతంలో ఉన్న సిసి టివి డివిఆర్‌తో పాటు తాళాలు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన మంగళవారం ఉదయం వెలుగు చూసింది. మెడికల్‌లో 5 లక్షలు ఉంటాయా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. నగరంలోని అత్యంత రద్దీ ప్రాంతంలో చోరీ జరగడం పోలీసుల భద్రత వైఫల్యం, యాజమాన్యం నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనబడుతోంది. స్థానిక ఆసుపత్రి మెడికల్ నిర్వాహకుల సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. ఓకటవ టౌన్ పోలీసులు వివరాల అడిగి తెలుసుకొని మెడికల్ లో క్షుణ్ణంగా పరిశీలించారు.

17శాతం తేమ ఉన్న ధాన్యం తేవాలి


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

నవతెలంగాణ-భీంగల్ రూరల్

మండలంలోని బాబాపూర్, బడాభీంగల్, ఛేంగల్, పల్లికొండలో ఏర్పాటుచేసిన ఐకెపి కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, డిఆర్‌డిఓ పిడి సాయాగౌడ్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా రైతులకు సూచనలు చేశారు. ధాన్యం 17శాతం లోపు తేమతో తీసుకురావాలని, ఏ గ్రేడ్ ధాన్యానికి దొడ్డు రకానికి 2320, సన్నాలకు 2300తోపాటు అదనంగా 500 బోనస్ ఇవ్వడం జరుగుతుందని రైతులకు తెలిపారు. కార్యక్రమంలో తాసిల్దార్ షబ్బీర్, ఏవో వంశీకృష్ణ, ఏఈఓ భార్గవ్ ఐకెపి ఎపిఎం రవీందర్, సెర్ప్ అధికారులు కుంట శ్రీనివాస్, పురాత నరేష్, రఘుపతి సాయిలు. కాంగ్రెస్ మండలాధ్యక్షులు బొద్రే స్వామి, డిసిసి కార్యదర్శి కుంట రమేష్. ఎస్టీ సెల్ అధ్యక్షులు గోపాల్ నాయక్, యువజన కాంగ్రెస్ నాయకులు నాగేంద్ర, కమ్మర్‌పల్లి డైరెక్టర్ చిన్నారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌ల ఆక్రమణవల్లే ట్రాఫిక్ సమస్య

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ


మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు అర్బన్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్పా గంగారెడ్డి, మున్సినల్ కమిషనర్ దిలీప్ కుమార్, ట్రాఫిక్ ఏసీపీ నారాయణలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నగరంలో విచ్చలవిడిగా ఫుట్ ఫాత్‌లు కబ్జాలు చేయడం వల్ల ట్రాఫిక్ నియంత్రణ కావడం లేదని తక్షణమే అక్రమ నిర్మాణాలను తొలగించాలని మున్సిపల్ కమిషనర్, ట్రాఫిక్ ఏసీపీని ఆదేశించారు. నగరంలో రోడ్లపై కూరగాయలు, తోపుడు బండ్లతో వ్యాపారాలు కొనసాగించడం వల్ల అత్యవసర సమయాల్లో అంబులెన్సు కూడా వెళ్లలేని పరిస్థితి ఉందని, వీధి వ్యాపారాలు చేసుకునే వారిని తక్షణమే రైతు బజారులోకి మార్చాలని అధికారులను ఆదేశించారు. నగరంలో పలు చోట్ల చెత్త వ్యర్థాలను సరిగా తొలగించడం లేదని, మార్కెట్ వంటి పరిసరాల్లో కుప్పలు తెప్పలుగా చెత్త పేరుకుపోయి ఉండటం వల్ల, డ్రైనేజీ వ్యర్థాలను పూర్తిగా తొలగించని కారణంగా ప్రజలు అనారోగ్యం బారిన పడాల్సి వస్తుందని, ఇలాంటివి పునరావృతం కాకుండా మున్సిపల్ అధికారులు ప్రతేక చొరవ తీసుకోవాలని అన్నారు. కార్యక్రంలో ట్రాఫిక్ సీఐ వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

'మా గుడిసెలకు పట్టాలు ఇవ్వండి'

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

మా గుడిసెలకు పట్టలు ఇవ్వండి ఎమ్మెల్యే సార్ అని పేదలు మొరపెట్టుకున్నారు. నిజామాబాద్ నగరంలోని మాధవ నగర్‌లో గల నర్సన్న కాలనీలో నివాసముంటున్న గుడిసె వాసులకు మంగళవారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని కలిసి శాలువా కప్పి సత్కరించి, గుడిసె వాసుల బాధను వివరించారు. రెండు నెలల్లో ప్రస్తుతం ఉన్న గుడిసెలకు పట్టాలిస్తామని, రోడ్డు వేస్తామని హామీ ఇచ్చారని వారన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు కత్తుల మారుతి, పల్ల మల్లేష్, నరసింహులు, సత్యనారాయణ, శంకర్, రాజు, కొండ అనుషవ్వ షేక్ రజియా, అనిత, అలుగు శోభ తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలుచేయకుంటే పోరాటాలే

- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం (వ్యకాస)

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నాందేవ్ వాడలోగల తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది వెంకట్రాములు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలో భాగంగా ఈనెల 6వ తేదీ నుంచి బీసీ కులగణనతోపాటుగా ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక కూడా చేపడుతున్నామని ప్రకటించిందన్నారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇల్లు సొంత స్థలంలో నిర్మించుకునే వారికి ఐదు లక్షల రూపాయల ఆర్థిక సహాయం చేస్తామని ఇచ్చింది కానీ, ఆ ఇండ్లు అసంపూర్తిగానే ఉన్నాయన్నారు. వాటిని కూడా పరిగణలోకి తీసుకొని పూర్తిచేసే ప్రయత్నం చేయాలని డిమాండ్ చేశారు. స్థలం ఉండి ఇల్లు కట్టుకోలేని వాళ్లకు ఇండ్లు,



మాట్లాడుతున్న పెద్దివెంకట్రాములు

స్థలం లేని వాళ్లకు రెండో విడతల్లో స్థలమిచ్చి ఇల్లు కట్టిస్తామన్నారు కానీ శిథిలావస్థకు చేరుకున్న ఇండ్లకు కూడా ఇండ్లు కట్టుకోవడం కోసం ప్రభుత్వం చొరవ చూపాలని సూచించారు. లబ్ధిదారుల ఎంపిక, బీసీ కులగణన కూడా పారదర్శకంగా ఉండాలని అన్నారు. బీసీ కులాలను జనాభా ప్రాతిపదికన దామాషా పద్ధతుల్లో రానున్న స్థానిక ఎన్నికల్లో, ఇతర ఎన్నికల్లో రిజర్వేషన్ నిర్ణయించాలని, అం దులో కూడా క్రిమిలేయర్‌ని పాటించాలని సూచి ంచారు. అలాగే వ్యవసాయ కార్మికు లకు ఆరుగ్యారెంటీల్లో భాగ ంగా కూలి బంధు 12వేలు ఇస్తామన్నారని తెలిపారు. ఇటీవలపట్టాణాలకు దగ్గరలో ఉన్న గ్రామాలను కార్పొరేషన్లలో, పట్టణాల్లో చేర్చారని, వారికి ఉపాధి కూలీ చేసుకునే అవకాశం లేకుండా పోయిందని అన్నారు. అలాగే పట్టణాల్లో ఉన్న వారికి ఉపాధి పథకాన్ని కూడా ప్రారంభించాలని సూచించారు. డ్వాక్రా గ్రూపులలో ఉన్న మహిళలు వ్యవసాయ కూలీలే అత్యధికంగా ఉన్నారని, వారికి వడ్డీలేని రుణాలు ఇస్తామని చెప్పి వడ్డీతోసహా ముక్కు పిండి బ్యాంకర్స్ వసూలు చేస్తున్నారని అన్నారు. దాన్ని అరికట్టి ఇప్పటికే వసూలు చేసిన వాటిని మూలధనంలో నుంచి కట్ చేస్తూ నెలవారి వాయిదాలు సులభతరం చేయాలని కోరారు. లేకపోతే సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం మీద సమరశీల పోరాటం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొర్ర సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు నాగుల గోవర్ధన్, జిల్లా సహాయ కార్యదర్శి గుండ్ల లక్ష్మణ్, జిల్లా కమిటీ సభ్యులు నర్రకళ, చంద్రకాంత్, శంకర్, సాయిలు, బోండ్ల లక్ష్మీ నర్సయ్య, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే కాంగ్రెస్‌కు తెలుసు

- రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి
- కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-మోపాల్

గత పాలకుల్లాగా దోచుకోవడం దాచుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలియదని, ప్రజా సంక్షేమ మాత్రమే తెలుసనని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి తెలిపారు. రూరల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మోపాల్, నిజామాబాద్ రూరల్ మండలాల చెందిన కళ్యాణ లక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూపతి రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పార్టీలకతీతంగా


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

నిరుపేదలందరికీ షాదీ ముబారక్ కళ్యాణ లక్ష్మి చెక్కులను అందజేస్తుందని, అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను కూడా అమలు చేస్తుందని తెలిపారు. ఈనెల 6న చేపట్టే సర్వేకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. సర్వే పూర్తయిన వెంటనే డిజిటల్ కార్డుల పంపిణీ ఉంటుందని అన్నారు. రైతులందరికీ రుణ మాఫీ జరుగుతుందని, ప్రతిపక్షాల మాటలను నమ్మి మోసపోవద్దని ఆయన తెలిపారు. రైతులకు సన్నాలకు 500 బోనస్ ఇస్తున్నామని, ఇది రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని రైతుల గురించి ఆలోచించే ప్రభుత్వం కేవలం కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆయన తెలిపారు. కార్యక్రమంలో టిపిసిసి డెలిగేట్ శేఖర్ గౌడ్, మోపాల్ మండల అధ్యక్షుడు సాయి రెడ్డి, బాడ్సి సొసైటీ చైర్మన్ నిమ్మల మోహన్ రెడ్డి, న్యాల్కల్ మాజీ సర్పంచ్ గంగా ప్రసాద్, సతీష్ రావు, రాజేష్ తాసిల్దార్ రామేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్మికుడికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఉప్లూర్ గ్రామానికి చెందిన గ్రామ పంచాయతీ కార్మికుడు స్వామికి మంగళవారం 2006-07 పదవ తరగతి బ్యాచ్ స్నేహితులు రూ.15 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. గ్రామ పంచాయతీ డాక్టర్ డ్రైవర్‌గా విధులు నిర్వర్తించే స్వామి, కరెంటు పనులను కూడా చేస్తుంటాడు. కొద్దిరోజుల క్రితం గ్రామంలో కరెంటు స్తంభంపై విద్యుత్ పనులు చేస్తుండగా షాక్‌కు గురై కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో స్వామి కాళ్ళు, చేతులు కాలడంతోపాటు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆస్పత్రికి తరలించగా చికిత్సలు తీసుకొని, ఇటీవల ఇంటికి వచ్చాడు. బాధితుడు స్వామి కుటుంబ పరిస్థితి అంతంత మాత్రమే ఉంటుంది. బాధితుడి కుటుంబ ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న గ్రామానికి చెందిన 2006-07 పదవ తరగతి బ్యాచ్ స్నేహితులు తమ వంతు సహాయంగా రూ.15 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ మేరకు ఆర్థిక సహాయం మొత్తాన్ని బాధితుడు ఇంటి వద్దకు వెళ్లి అందజేసి, పరామర్శించారు. కార్యక్రమంలో 2006-07 పదవ తరగతి బ్యాచ్ స్నేహితులు పోలీస్ కానిస్టేబుల్ రఘువీర్ గౌడ్, శేఖర్ గౌడ్, శేఖర్, మణిదీప్, శివ రెడ్డి, మొకిమ్, శ్రీనివాస్, అజార్, శివరాం యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

2.50లక్షల ఎల్‌ఓసీ అందజేత

నవతెలంగాణ-ఏర్గట్ల



మండలంలోని తడపాకల్ గ్రామానికి చెందిన మహమ్మద్ ఇమామ్ తీవ్రమైన వెన్నునొప్పితో బాధపడుతూ...హైదరాబాద్ లోని నిమ్స్ ఆసుపత్రిలో చేరగా ఆపరేషన్ నిర్వహించారు.విషయం తెలుసుకున్న బాల్కొండ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ ముత్యాల సునీల్ రెడ్డి ఆర్థిక సహాయం కోసం, భాధితునికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 2 లక్షల 50 వేల రూపాయల ఎల్ఓసీ ఇప్పించారు. ఈ సందర్భంగా ఇమామ్ కుటుంబ సభ్యులు సునీల్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

స్మైల్సు పాఠశాలలో సంబరాలు

నవతెలంగాణ-ఆర్మూర్



పట్టణంలోని స్మైల్స్ పాఠశాలలో హెలవెన్స్ డే మంగళవారం ఘనంగా జరుపుకున్నారు . ఈ సందర్భముగా స్పోకి డెకొరేషన్ హలో థీమ్ గేమ్స్ మర ఆక్టివిటీస్ చేయించారు. హలో వీన్స్ ఒక మంచి అపార్చునిటీ విద్యార్థిని విద్యార్థులు ఒక మంచి ఫన్ ఫీల్డ్ ఆక్టివిటీస్ ద్వారా ఆడుతూ పాడుతూ ఒక పండుగ వాతావరణంలా జరుపుకున్నారు. ఇందులో చిన్నారులు రకరకాల కాస్ట్యూమ్స్‌తో మేకోవర్ చేసుకొని ఒక మంచి వాతావరణం సృష్టించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ రఫీ గౌహర్ మాట్లాడుతూ సెలబ్రేషన్స్ చేయనికి కారణం పిల్లల్లో ఉన్న టాలెంట్‌ను వారి యొక్క ఆక్టివిటీస్‌ను ఈ హలోన్స్ డే సందర్భంగా ఫ్రేమ్ చేసిన గేమ్స్ ద్వారా యాక్టివిటీస్ ద్వారా వారిలో ఉన్న టాలెంట్ ను ఎంకరేజ్ చేయడమేనని అన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ప్రిన్సిపల్ షబానా గౌహర్, స్టాఫ్ సింధూర, సవిత, సప్న, సరిత, సింధుజ, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలలో కరాటే శిక్షణ తరగతులు ప్రారంభం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి


కరాటే శిక్షణ ప్రారంభిస్తున్న ప్రధానోపాధ్యాయులు

మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినిలకు మంగళవారం కరాటే శిక్షణ తరగతులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు పసుపుల సాయన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఝాన్సీ లక్ష్మీబాయి ఆత్మరక్షణ ప్రశిక్షణ కార్యక్రమం ద్వారా ఉన్నత పాఠశాల విద్యార్థినిలకు ఆత్మరక్షణలో భాగంగా కరాటే శిక్షణ కార్యక్రమాన్ని ప్రతి సంవత్సరం నవంబర్ నుండి జనవరి వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. దీనిలో భాగంగా ఈ సంవత్సరం కూడా ప్రభుత్వం నుండి కరాటే శిక్షణ తరగతులు ప్రారంభించాలని ఆదేశాలు వచ్చాయన్నారు. కరాటే శిక్షకులను కూడా జిల్లా స్థాయిలో ఎంపిక చేసి పాఠశాలలకు పంపించారన్నారు. అనంతరం కరాటే శిక్షకుడు రోహిత్ కరాటే లో విద్యార్థినిలకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ నాగభూషణం, ఉపాధ్యాయిని ఉపాధ్యాయ సిబ్బంది, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.


గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదుకు నెల చివరి వరకు అవకాశం ఇవ్వాలి


మాట్లాడుతున్న సిపిఐ నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ నమోదుకు నవంబర్ చివరి వరకు ఎలక్షన్ కమిషన్ అవకాశం ఇవ్వాలి అని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. మంగళవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా పి.సుధాకర్ మాట్లాడుతూ.. మెదక్, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలకు సంబంధించిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ నమోదు ప్రక్రియ ఈనెల 6 వరకు ఓటర్ నమోదు ముగిస్తుందన్నారు. 2021 వరకు డిగ్రీ పూర్తి చేసిన గ్రాడ్యుయేట్లు మరింత ఓటును నమోదు చేసుకోవడం కోసం నవంబర్ చివర వరకు అవకాశం ఇయ్యాల్సిందిగా ఎలక్షన్ కమిషన్ను కోరుతున్నామని అన్నారు. ఓటర్ కొరకు అవకాశం ఉండి ఇతర కారణాలవల్ల నమోదు చేసుకొని వారు తమ ఓటును నమోదు చేసుకోవాలని కోరారు. సమావేశంలో సిపిఐ నగర కార్యదర్శి వై.ఓమయ్య, సిపిఐ జిల్లా నాయకులు బి.రఘురాం, హనుమాన్లు, టోకు పాల్గొన్నారు.

ఉద్యమ వైతాళికుడు దాశరథి


నివాళ్లు అర్పిస్తున్న స్కూల్ సిబ్బంది

నవతెలంగాణ-సిరికొండ

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అక్షరాన్ని ఆయుధంగా మలిచి, నిజాం పాలనపై అక్షర శరాలు సంధించి ధిక్కార స్వరం వినిపించిన ఉద్యమ వైతాళికుడు దాశరథి కృష్ణమాచార్యులని సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపాల్ రావుట్ల నర్సయ్య అన్నారు. తెలంగాణ ఉద్యమ సాహిత్య కెరటం, రచయిత, కవి, తొలి, మలి దశ ఉద్యమాలకు భాషా కలంతో కవాతులు చేయించి తెలంగాణ ప్రజలను చైతన్య పరిచిన అక్షర ప్రభంజనం దాశరథి కృష్ణమాచార్య 17వ వర్ధంతి సందర్భంగా సత్యశోధక్ పాఠశాలలో ప్రిన్సిపల్ ఆర్. నర్సయ్య దాశరథి కృష్ణమాచార్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ.. నిజాం నవాబుల నియంతృత్వ పోకడలతో కూడిన పాలనలో అరిగోస పడుతున్న తెలంగాణ ప్రజలను చైతన్య పరచి జైలు గోడలలో సైతం తన భావజాలాన్ని చాటి చెప్పిన దాశరథి కృష్ణమాచార్య ధీరత్వం శ్లాఘించదగినదన్నారు. నమ్మిన సిద్ధాంతం కోసం ఊపిరి ఉన్నంత వరకు ఆచరించి పోరాడిన దాశరథి స్ఫూర్తితో స్వరాష్ట్ర ఉజ్వల ప్రగతికి తమవంతు బాధ్యతను నిర్వర్తించి తెలంగాణ సర్వతోముఖాభివృద్ధికి పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల విజేతలుగా ఏకలవ్య విద్యార్థులు


ప్రశంస పత్రాలతో విద్యార్థులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్ వాయి మండలంలోని గంగారం తండా గ్రామ పంచాయతీ పరిధిలోని (ఈఎంఆర్ఎస్) ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలకు చెందిన విద్యార్థులు పలు క్రీడల్లో విజేలుగా నిలిచినట్లు ఏకలవ్య పాఠశాల కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ కుమార్ మంగళవారం తెలిపారు. నాలుగవ రాష్ట్ర స్థాయి క్రీడలు గాంధారిలో ఈ నెల 2 నుండి 4 వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొన్నారని తెలిపారు. ఈ క్రీడల్లో నేషనల్ స్థాయిలో ఆర్ అంశుమాన్ ఏడవ తరగతి విద్యార్థి జూడో విభాగంలో ఎన్నిక కావడం సంతోష దాయకమన్నారు. 14 సంవత్సరాల విభాగంలో 62 కేజీల జూడో విభాగంలో ప్రథమ స్థానం పొందినట్లు పేర్కొన్నారు. తద్వారా దేశ స్థాయిలో జరిగే పోటీలకు అర్హత సాధించడం జరిగిందని, ఆర్ అంశుమాన్ రెజ్లింగ్ లో కూడా 68 కేజీల విభాగంలో ద్వితీయ స్థానం పొందగా, మరో విద్యార్థి తులసి రామ్ ఏడో తరగతి విద్యార్థి బాక్సింగ్ విభాగంలో అండర్-14 లో తృతీయ స్థానం పొందినట్లు తెలిపారు. తులసి రామ్ రెజ్లింగ్ విభాగంలో కూడా తృతీయ స్థానం పొందారని, మరో విద్యార్థి ఎం రామ్ చరణ్ ఎడవ తరగతి టైక్వాండో విభాగంలో తృతీయ స్థానం పొందారని తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల విజేతలను ప్రిన్సిపాల్ అభినందించి ముందు జరిగే పోటీల్లో విజేతలుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో సంతోష్, సునీత, రోహిత్, దివ్య, కుల్దీప్, రవికాంత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. రాష్ట్రస్థాయి వివిధ క్రీడలలో 30కి పైగా విద్యార్థులు పాల్గొన్నట్లు ప్రిన్సిపాల్ అశోక్ కుమార్ వివరించారు.

పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు

నవతెలంగాణ-మాక్లూర్


టీకాలు అందజేస్తున్న పశువైద్యాధికారులు

మండలం లోని వల్లభాపూర్ గ్రామాల్లో పశు వైద్య, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశు వులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలను పశు వైద్యాధికారులు డా. కిరణ్ దేశ్ పాండే, ఉమామ సహెర్ అధ్వర్యంలో ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 490 ఆవులకు ఉచిత గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సంద్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతిరైతు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టోకాలు వేయ్యించాలని, ఈ వ్యాధి వల్ల పాల ఉత్పత్తి తగ్గుతుందని, అతిజ్వరం కాలిలో పుండ్లు, నోటి పండ్లు ఎక్కువగా ఉంటాయని తద్వారా పునరుత్పత్తి సామర్థ్యం తగ్గుతుందని తెలిపారు. కార్యక్రమంలో వియల్ ఓ వినిత, జేవీఓ కల్యాణి, వీఏ పాశా గంగధర్, ఓఎస్ పుష్ప, హెచ్ఏ మహేశ్వరి, గోపాలమిత్ర సుదీర్, రైతులు పాల్గొన్నారు.

3
నవతెలంగాణ
కామారెడ్డి
బుధవారం | నవంబర్ 06, 2024 | www.navatelangana.com

చేప పిల్లలు పంపిణీ

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని ఆయా గ్రామాల్లో గల చెరువులకు మంగళవారం రెండు లక్షల 67 వేల చేప పిల్లలను ఉచితంగా పంపిణీ చేసినట్లు మత్స్యశాఖ డైరెక్టర్ సాయిలు తెలిపారు. మండలంలోని 23 చెరువులకు గాను ఈ చేప పిల్లలను పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్ ఠాగూర్, క్రమశిక్షణ సంఘం సభ్యులు రామచంద్రరెడ్డి, మైనార్టీ అధ్యక్షుడు ఇమామ్, గులాము హుస్సేన్, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చేప పిల్లలను పంపిణీ చేస్తున్న మత్స్యశాఖ డైరెక్టర్

కుటుంబ సర్వేపై శిక్షణా తరగతులు

నవతెలంగాణ-గాంధారి

మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని అన్ని గ్రామాల కుటుంబ సర్వే అధికారులకు సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, ఇంటింటి కుటుంబ సర్వేపై మండలంలోని ఎన్యుమరెటర్లందరికీ, సూపర్‌వైజర్‌లకు ప్రొజెక్టర్ ద్వారా టీవోటీలు మంగళవారం శిక్షణనిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో రాజేశ్వర్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిడీవో రాజేశ్వర్

ఎరువులు అధిక ధరలకు అమ్మొద్దు

- జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్

నవతెలంగాణ-నిజాంసాగర్/పిట్లం

అధిక ధరలకు ఎరువులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్ అన్నారు. మంగళవారం ఆయన ఉమ్మడి నిజాంసాగర్ మండలంలోని ఎరువుల దుకాణాలను, ఎరువుల గోదాంలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధార్‌కార్డు తీసుకువచ్చిన రైతులకు ఇపిఓఎస్ యంత్రం ద్వారా మాత్రమే రైతులకు ఎరువులు విక్రయించాలని ఆయన దుకాణదారులను ఆదేశించారు. యూరియా ఇతర ఎరువుల నిలువలు, నిలువ పట్టికలు, నిల్వ రిజిస్టర్లు ఆయన పరిశీలించారు. అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. రైతులందరికీ కూడా జీఎస్టీ, ఇన్వైస్లతో కూడిన బిల్లులతో రైతులకు ఎరువులను విక్రయించాలని ఆయన దుకాణం యజమానులకు ఆదేశించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అమర్ ప్రసాద్, వ్యవసాయ విస్తరణ అధికారి మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.



నిజాంసాగర్ : తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్

పిట్లం : రైతులు వరి ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధరను పొందాలని జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్ సూచించారు. మంగళవారం మండలంలోని బొల్లపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన వరి ధాన్యాన్ని దళారులకు విక్రయించి నష్టపోవద్దని అన్నారు. కాగా ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద విక్రయించే సమయంలో ప్రభుత్వం సూచించిన విధంగా రైతులు నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ప్రదీప్‌రెడ్డి రైతులు పాల్గొన్నారు.

సాందీపని డిగ్రీ కళాశాలలో యూనివర్సిటీ లెవల్ క్విజ్ పోటీలు



క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి పట్టణ కేంద్రంలోని సాందీపని డిగ్రీ కళాశాలలో యూనివర్సిటీ లెవెల్ (మ్యాథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్) క్విజ్ పోటీలకు అర్హత గల విద్యార్థుల కోసం సెలక్షన్ ప్రాసెస్ నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ సాయిబాబా తెలిపారు. దీనిలో భాగంగా కళాశాలకు చెందిన 70 మంది విద్యార్థినీ, విద్యార్థులు పోటీలో పాల్గొన్నారని, వీరిలో ముగ్గురు విద్యార్థులు యూనివర్సిటీ స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారన్నారు. ఈ ప్రోగ్రాం నిర్వహించడానికి యూనివర్సిటీ అకాడమిక్ కన్సల్టెంట్ సందీప్ యూనివర్సిటీ తరపున పర్యవేక్షకునిగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కళాశాల ప్రిన్సిపల్ సాయిబాబా, అకాడమిక్ ప్రిన్సిపాల్ మనోజ్, మ్యాథ్స్ రాజేందర్, స్టాటిస్టిక్ రాజు, మ్యాథ్స్ రాజు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

పెట్టుబడుల అన్వేషణకే లండన్ పర్యటన

- ఎమ్మెల్యే తోట లక్ష్మికాంతారావు



మంత్రితో ఎమ్మెల్యే

నవతెలంగాణ-పిట్లం

తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడుల అన్వేషణే లక్ష్యంగా లండన్ పర్యటనకు బయలుదేరి వెళ్లినట్లు జుక్కల్ నియోజకవర్గ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు మంగళవారం వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి గానూ అధికారికంగా మూడు రోజులపాటు జరగనున్న వరల్డ్ ట్రావెల్ మార్కెట్ (డబ్ల్యూటిఎం)లో పాల్గొనేందుకుగాను రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి ఇరువురం బయలుదేరి వెళ్లినట్లు తెలిపారు. రాష్ట్ర టూరిజాన్ని ప్రమోట్ చేయడం, పర్యాటక రంగంలో పెట్టుబడులే లక్ష్యంగా పర్యటన సాగనున్నట్లు వెల్లడించారు. కాగా ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ నాయకులు వీరికి ఘన స్వాగతం పలికినట్లు ఆయన తెలిపారు.

కొత్త కుటుంబాలను గుర్తించాలి

నవతెలంగాణ-నిజాంసాగర్

కొత్త కుటుంబాలను గుర్తించాలని మండల ప్రత్యేకాధికారి సూచించారు. మంగళవారం మండలంలోనీ అచ్చంపేట గ్రామంలోని రైతు వేదికలో ఉమ్మడి మండలాలకు సంబంధించి సోషల్ ఎకనామిక్ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా మండల స్పెషల్ ఆఫీసర్ తిరుమల ప్రసాద్ మాట్లాడుతూ.. మండలంలోని ఉమ్మడి కుటుంబాలు ఎన్ని ఉన్నాయో గుర్తించి వాటిలో కొత్త కుటుంబాలు ఎన్ని ఏర్పడ్డాయో వాటిని గుర్తించి వారి ఇంటికి స్టిక్కర్లను వేయాలని ఆయన సూచించారు. రేపటి నుంచి ఈనెల 8 వరకు మండలంలోని అన్ని గ్రామాలలో ప్రైమరీ డాటాను మొత్తం సేకరించి ఈ నెల 9 నుంచి ఎలాంటి తప్పులు లేకుండా సర్వే నిర్వహించాలని ఆయన సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి గంగాధర్, మండల పంచాయతీ అధికారి అనిత, ఉమ్మడి మండలాల విద్యాశాఖ అధికారులు తిరుపతిరెడ్డి, అమర్‌సింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుమలత, ఉమ్మడి మండలాల గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థిని డీఎం సన్మానం

నవతెలంగాణ-బోధన్

బోధన్ డిపోలో ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తున్న మేఘ్యు కుమారుడు చంద్రకాంత్ ఎంబీబీఎస్‌లో సీటు సాధించడంతో బోధన్ డిపోలో డీఎం శ్రీనివాస్ విద్యార్థితో పాటు తల్లిదండ్రులకు శాలువా, పూలమాలలతో మంగళవారం సన్మానించారు. భవిష్యత్తులో డాక్టర్‌గా విధులు నిర్వహించి ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని డీఎం ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంఎఫ్ శ్రావణ్‌కుమార్, ఎస్‌టిఐ లక్ష్మణ్, ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ రీజినల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థిని సన్మానిస్తున్న డీఎం శ్రీనివాస్

కాలభైరవ స్వామిని దర్శించుకున్న మంత్రి దామోదర రాజనర్సింహ



పూజారులతో మంత్రి

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని ఈసన్నపల్లి (రామారెడ్డి)లో వెలిసిన శ్రీ కాలభైరవ స్వామి దేవస్థానాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ పూజారులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలుకగా, ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ సిబ్బంది ఆయనను శాలువాతో సన్మానించి, స్వామివారి జ్ఞాపిక, తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ప్రభు రామచంద్రం, నాగిరెడ్డిపేట్ మాజీ జెడ్పిటిసి మనోహర్‌రెడ్డి, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెంజల్‌లో గ్రామసభ

నవతెలంగాణ-రెంజల్

2025-26 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పనుల గుర్తింపులో భాగంగా మంగళవారం రెంజల్ గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ సభను ఏర్పాటు చేసినట్లు గ్రామ కార్యదర్శి రాజేందర్‌రావు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఫార్మేషన్ రోడ్లు, హరితహారం మొక్కలు నాటుట, పంట కాలువలను శుభ్రం చేయడం, ఇంకుడు గుంతల నిర్మాణం తదితర అంశాలపై పనులను గుర్తించినట్లు ఏపీవో రమణ తెలిపారు. ఈ కార్యక్రమంలో క్షేత్ర సహాయకుడు ఉల్లి శోభన్, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గ్రామ కార్యదర్శి

వరి కొనుగోలు కేంద్రాలు పరిశీలన

నవతెలంగాణ-రామారెడ్డి

మండల కేంద్రంలోని వరి కొనుగోలు కేంద్రాన్ని స్థానిక తహసీల్దార్ సువర్ణ, సివిల్ సప్లై డిటి శ్రీనివాస్ మంగళవారం స్థానికై ఏఈఓ రాకేష్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రాకేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వరి ధాన్యం తేమశాతం 17లోపు ఉండాలని, సన్నరకం ధాన్యం 6 మిల్లీమీటర్ పొడవు, రెండు మిల్లీమీటర్ల అడ్డం ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పోసానిపేట ఏఈఓ నికిత, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మూఢనమ్మకాలపై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-రెంజల్

నిజామాబాద్ ఇంచార్జ్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు మండల కేంద్రమైన రెంజల్ జిల్లా పరిషత్ పాఠశాలలో మూఢనమ్మకాలు, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో నాటికలు, పాటల రూపంలో విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కల్పించినట్టు రెంజల్ ఎస్సై ఈ.సాయన్న తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత గంజాయి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, హెల్మెట్ ధరించడం బరువు కాదని బాధ్యత అని ఆయన గుర్తించుకోవాలన్నారు. మహిళల భద్రత కోసం నిజామాబాద్‌లో షీ టీం రక్షణ కల్పిస్తుందన్నారు. మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న వారు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని, ఈసీఐఆర్ పోర్టల్ ద్వారా వాటిని తిరిగి బాధితుడికి అప్పగించనున్నట్టు ఆయన పేర్కొన్నారు. అత్యవసర సమయంలో మాత్రమే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని ఆయన అన్నారు. ఆన్లైన్ మోసాలకు గురైన బాధితులు 1930కి సమాచారం అందించాలని ఆయన పేర్కొన్నారు. సమాజంలో పెరుగుతున్న నేరాలు, చట్టాలపైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రెంజల్ ఎస్సై సాయన్నతో పాటు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కట్ట ఆంజనేయులు, పిఆర్‌టియు మండల ప్రధాన కార్యదర్శి కిషోర్ కుమార్, ఉపాధ్యాయులు వి.గంగాధర్, గంగాధర్, అరుణ్ కుమార్, నిజామాబాద్ పోలీస్ కళాబృందం తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్సై ఈ.సాయన్న

ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

- టిపియుఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

నవతెలంగాణ-కామారెడ్డి

ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని టిపియుఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం కామారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద ధర్మాగ్రహ దీక్ష చేపట్టారు. దీక్షానంతరం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ధర్మాగ్రహ దీక్షలో జిల్లా అధ్యక్షుడు పులగం రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శి భూనేకర్ సంతోష్ మాట్లాడుతూ.. ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలైన నాలుగు డిఏలు, పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని, పిఆర్సిని వెంటనే అమలు చేయాలని, 317 జిఓ బాధిత ఉపాధ్యాయుల సమస్యను పరిష్కరించాలని, సిపిఎస్‌ను అంతంచేసి ఓపిఎస్‌ను అమలు చేయాలని పేర్కొన్నారు. లేనిపక్షంలో నవంబర్ 23న హైదరాబాద్‌లో ఇందిరాపార్క్ వద్ద రాష్ట్రస్థాయిలో పెద్దఎత్తున ధర్నా నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు రవీంద్రనాథ్ ఆర్య, రాష్ట్ర బాధ్యులు మేక రామచందర్, భాస్కరాచారి, జిల్లా బాధ్యులు లక్ష్మీపతి, ఆంజనేయులు, శివకాంత్, వేద్ ప్రకాష్, సంతోష్, భాస్కర్, జిల్లా కార్యవర్గ సభ్యులు, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



దీక్ష నిర్వహిస్తున్న టిపియుఎస్ నాయకులు

'భేటీ బచావో భేటీ పడావో'ను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-లింగంపేట్

గ్రామాల్లో ఆశావర్కర్లు 'భేటీ బచావో భేటీ పడావో'ను విజయవంతం చేయాలని వైద్యాధికారి డాక్టర్ హిమబిందు ఆశావర్కర్లకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లింగంపేట్‌లో డాక్టర్ హిమబిందు ఆధ్వర్యంలో ఆశ డే సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ కార్యకర్తలకు, వైద్య సిబ్బందికి 'భేటీ బచావో భేటీ పడావో'పై అవగాహన కల్పించారు. గ్రామాలలో స్త్రీలు లింగ నిర్ధారణ చేసుకోవడాన్ని, అబార్షన్స్‌ను అడ్డుకోవాలని అన్నారు. లింగ నిర్దారణను అడ్డుకుని ఇది చట్టవిరుద్ధమని సూచిస్తూ, ఇలాంటి చర్యలకు పాల్పడకుండా వారికి మనో ధైర్యం కల్పించాలని, ఎవరైనా లింగనిర్ధారణకు ప్రోత్రహిస్తే వారిపై చట్టపరంగా చర్యలుంటాయని హెచ్చరించారు. 'భేటీ బచావో భేటీ పడావో' భారతదేశంలోని బాలికల సంక్షేమం కోసం ప్రారంభించబడిన ఓ ప్రభుత్వ పథకమని తెలిపారు. గ్రామాల్లో అమలయ్యేలా చూడాలన్నారు. బాలికల జనన నిష్పత్తిని పెంచడం, ఆడపిల్లలను కనడం పట్ల సమాజంలో సానుకూల దృక్పథాన్ని పెంపొందించడం, ఆడపిల్లలందరికీ సమాన విద్యా అవకాశాలు లభించేలా చూడడం ఈ పథకం ప్రధాన లక్ష్యాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు ఫరీదా, చంద్రకళ, యాదగిరి, ఆశావర్కర్లు తదితరులున్నారు.



మాట్లాడుతున్న వైద్యాధికారి హిమబిందు

తెలంగాణ మూడవ విద్య మహాసభలను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-నిజాంసాగర్

తెలంగాణ మూడవ విద్య మహాసభలను విజయవంతం చేయాలని ఎస్సీ, ఎస్టీ సంఘం అధ్యక్షులు దేవిసింగ్ తెలిపారు. మంగళవారం మండలంలోని అచ్చంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నిజాంసాగర్ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ మూడవ విద్య మహాసభ పోస్టర్‌ను మండల పరిషత్ అభివృద్ధి అధికారి గంగాధర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిసెంబర్ ఒకటి రెండు తేదీలలో కామారెడ్డిలో నిర్వహించే విద్య మహాసభలను విజయవంతం చేయాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బీమ్‌రావ్, శ్రీరామ్, సురేందర్, లాలొసింగ్, రవీందర్, సాయిలు, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కూనేపల్లి, బాగేపల్లి గ్రామాలలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను అందజేసినట్టు మండల పశు వైద్యాధికారి డాక్టర్ విట్టల్ తెలిపారు. ఈ రెండు గ్రామాలలో 192 తెల్లజాతి పశువులు, 254 నల్లజాతి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను పంపిణీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో జూనియర్ పశు వైద్య అధికారులు నాగరత్న, గంగరాజు, సిబ్బంది లక్ష్మణ్, సావిత్రి, నవీన్, గోపాలమిత్రలు భాస్కర్ గౌడ్, యశ్వంత్, రైతుబుజ్జి సేట్, రైతులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో ఆలయంలో సీసీ రోడ్డు నిర్మాణం



కొనసాగుతున్న పనులు

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని ఇసన్నపల్లి రామారెడ్డి లో వెలిసిన శ్రీ కాలభైరవ స్వామి ఆలయ ప్రాంగణంలో సిసి రోడ్డు లేక భక్తులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలుసుకొని ఉమ్మడి సదాశివ నగర్ మాజీ జెడ్పిటిసి పడగల రాజేశ్వరరావు, స్థానిక మాజీ ఎంపీపీ నా రెడ్డి దశరథ్ రెడ్డి మాజీ ఆలయ కమిటీ చైర్మన్ గంజి సతీష్ గుప్తా విరాళాలు ఇస్తూ, భక్తుల నుండి విరాళాలు సేకరించామని, మరికొంత ఆలయ నిధులనుండి సిసి రోడ్డును నిర్మించామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ప్రభు రామచంద్రం, కిరణ్ కుమార్ రెడ్డి, జంగం లింగం తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని మద్దికుంట మాజీ సర్పంచ్ తోట గంగయ్య భార్య అనారోగ్యంతో మృతిచెందగా.. బాధిత కుటుంబాన్ని జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ అనీఫ్, దుంపల బాలరాజు, పెండ్యాల నర్సారెడ్డి, గజ్జల చిన్నరాజు, తోటలింగం తదితరులున్నారు.

పాఠశాలలో విద్యార్థుల హాజరుశాతం పెంచాలి

- ఎంఈఓ నాగయ్య

నవతెలంగాణ-బోధన్

పాఠశాలలో విద్యార్థుల హాజరుశాతం తప్పనిసరిగా పెంచాలని బోధన్ ఎంఈఓ నాగయ్య అన్నారు. మంగళవారం బోధన్ ఉప విద్యాధికారి కార్యాలయంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం పకడ్బందీగా నిర్వహించాలని, ఫండమెంటల్ లిటరసీ అండ్ న్యూమరసిలో భాగంగా మధ్య పరీక్ష నిర్వహించి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. డ్రాప్ అవుట్స్ విద్యార్థులు లేకుండా చూడాలన్నారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని, ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, పదవ తరగతి విద్యార్థినీ విద్యార్థులకు సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. ఉపాధ్యాయులు తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రత్నాకర్, ఆరిఫుద్దీన్, జ్యోతి, సూర్యకుమార్, సిఆర్పిలు విజయ్, బాబు, యూసఫ్, శివానంద్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ నగేష్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న బీజేపీ నాయకులు

నవతెలంగాణ-ఎడపల్లి

మండల కేంద్రానికి చెందిన సీనియర్ పాత్రికేయులు కందునూరి నరహరి గౌడ్ భార్య గత నాలుగు రోజుల క్రితం బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో హైదరాబాద్ కొంపల్లిలో గల వెల్‌నెస్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతోంది. ఈ విషయం తెలుసుకున్న ఎడపల్లి మండల బీజేపీ సీనియర్ నాయకులు కందగట్ల రాంచందర్ (అన్నాసేట్) ఆస్పత్రికి వెళ్లి పాత్రికేయులు నరహరిగౌడ్‌ను పరామర్శించారు. ఆమె ఆరోగ్యం పట్ల అడిగి తెలుసుకున్నారు. చికిత్స కోసం రామచందర్ రూ.10,000 ఆర్థిక సహాయం అందజేశారు. మనోధైర్యంగా ఉండాలని ఆయనకు అన్నారు. ఆయన వెంట హైదరాబాద్ ఆస్పత్రికి వెళ్లిన వారిలో నాయకులు రామ్‌రెడ్డి, ఎల్లయ్య యాదవ్, ఆకుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇంచార్జ్ ఎంపీడీవోగా హెచ్.శ్రీనివాస్

నవతెలంగాణ-రెంజల్

రెంజల్ ఎంపీడీవో వెంకటేష్ జాదవ్ సెలవుపై వెళ్లడంతో ఇంచార్జ్ ఎంపీడీవోగా మండల పరిషత్ సూపరింటెండెంట్ హెచ్.శ్రీనివాస్ మంగళవారం బాధ్యతలను చేపట్టారు. ఎంపీడీవో వెంకటేష్ జాదవ్ తిరిగి వచ్చేంతవరకు ఆయన ఇన్చార్జ్ ఎంపీడీవోగా కొనసాగుతారని ఆయన పేర్కొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
బుధవారం నవంబర్ 06, 2024 www.navatelangana.com

బాలికల సాధికారతపై అవగాహన

నవతెలంగాణ-ముప్కాల్

బాలికల సాధికారత (గుడ్ టచ్, బ్యాడ్ టచ్) అనే అంశాలపై ముప్కాల్ కేజీబీవీ పాఠశాలలో 8,9,10 తరగతుల విద్యార్థినిలకు మంగళవారం పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏఎస్సై సురేష్ ఆధ్వర్యంలో మహిళా కానిస్టేబుల్ రమణి విద్యార్థినిలకు పలు సూచనలు అందించారు. కార్యక్రమంలో ఏఎస్సై సురేష్, మహిళా కానిస్టేబుల్ రమణి, పాఠశాల ఎస్వో వినోద, పోలీసు సిబ్బంది, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఏఎస్ఐ

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-ముప్కాల్



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న అధ్యక్షులు

వేంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు జక్క రాజేశ్వర్ ఆధ్వర్యంలో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రంను ప్రారంభించారు. మద్దతు ధర వరికి సన్నాలకు రూ.2,300 రూపాయలు, దొడ్డువడ్లకు రూ.2,320 రూపాయలు. ప్రభుత్వం కేటాయించిన 33 రకాల సన్నాలకు రూ.500 రూపాయల బోనస్ అదనంగా పొందాలని తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బద్దం నర్సారెడ్డి, డైరెక్టర్లు జైడి రవి, కొమ్ముల మోహన్ రెడ్డి, శివాయి పరమేష్, ఆరేపల్లి మల్కన్న, సొసైటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

విజయవాడ తరలిన పిడిఎస్‌యూ నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

విజయవాడలో జరిగే పిడిఎస్‌యూ అర్ధ శతాబ్దోత్సవ సభకు నిజామాబాద్ పీడీఎస్‌యూ బృందం జన్నారపు రాజేశ్వర్, ప్రిన్స్ , జయంతి,రవీందర్,అక్షయ్, బిందు లు వెళ్ళారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పిడిఎస్‌యూ విద్యార్థి సంఘం ఏర్పడి 50 ఏండ్ల సందర్భంగా గత నెల ఉస్మానియా యూనివర్సిటీ లో సభ నిర్వహించారన్నారు. నేడు విజయవాడ లో జరుగుతుందని , రెండు తెలుగు రాష్ట్రాలలో పూర్వ పిడిఎస్‌యూ నాయకుల యాభై ఏళ్ల పోరాట అనుభవాలను, నేటి తరం అనుసరించే కర్తవ్యాలను రూపొందించుకుంటామని తెలిపారు. అమరవీరుల ఆశయసాదన కోసం, విద్య రంగా సమస్యలపై నిరంతరం పోరాడుతామని అన్నారు.

డివికె విగ్రహ ఆవిష్కరణను విజయవంతం చేయండి

నవతెలంగాణ - బాల్కొండ

ఆర్మూర్ ప్రజాపంథా పార్టీ కుమార్ నారాయణ భవన్ వద్ద ఈనెల తొమ్మిదవ తేదీన నిర్వహించే సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి డీవీకే విగ్రహావిష్కరణ జయప్రదం చేయాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం. ముత్తెన్న మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని కిసాన్ నగర్ గ్రామంలో సిజే పటేల్ బిడి కంపెనీ ముందు కార్మికులతో కలిసి విగ్రహ ఆవిష్కరణ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల వీడియో వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు జి.అరవింద్, మండల నాయకులు శ్రీనివాస్, కార్మికులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలోని అండర్ 17, అండర్ 14 రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఇందల్ వాయి మండలంలోని సంస్థాన్ సిర్నాపల్లి విద్యార్థులు ఎంపికయ్యారని పిడి రాజ్ కుమార్ మంగళవారం తెలిపారు. అండర్-17 విభాగంలో 9వ తరగతి చదువుతున్న శ్రీనివాస్, వీరేష్ ఎంపికయ్యారు. అండర్-14 విభాగంలో 8వ తరగతి సాయి కిరణ్, శ్రీరామ్, భవ్య శ్రీ ఎంపికయ్యారు. ఈ క్రీడా పోటీలు యాదాద్రి భువనగిరి జిల్లాలోని మాదాపూర్‌లో ఈ నెల 7 నుంచి 10 వరకు నిర్వహించనున్నారు. ఎంపికైన క్రీడాకారులను మండల విద్యాధికారి శ్రీధర్, ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు నాగరాజు, వీడిసి చైర్మన్ అశోక్, విడిసి సభ్యులు, మాజీ సర్పంచ్ తెలు విజయ్ కుమార్, మాజీ ఉప సర్పంచ్ నవీన్ గౌడ్, ఉపాధ్యాయ బృందం, గ్రామ యువజన సంఘాలు, గ్రామస్తులు అభినందించారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు కేజీబీవీ విద్యార్థిని ఎంపిక



నవతెలంగాణ-ఆర్మూర్

ఈనెల 1న సాంఘిక సంక్షేమ బాలికల కళాశాల క్రీడా మైదానంలో జరిగిన ఉమ్మడి జిల్లా స్కూల్ గేమ్స్ అండర్-19 సాఫ్ట్ బాల్ ఎంపిక లో కేజీబీవీ కళాశాల విద్యార్థిని శ్రీనిధి పాల్గొని చక్కని ప్రతిభ కనబరిచింది.

ఈనెల 8 నుండి 10 వరకు మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి లో జరిగే రాష్ట్ర పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల స్పెషల్ ఆఫీసర్ గంగా మణి మంగళవారం తెలిపార్సు, జట్టును ప్రథమ స్థానంలో నిలపడానికి కృషి చేయాలని స్పెషల్ ఆఫీసర్ అన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారుని అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయురాలు బి వీణ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

మండల విద్యాశాఖ అధికారికి సన్మానం

నవతెలంగాణ-(వేల్పూర్) ఆర్మూర్

గత ఆరు సంవత్సరాలుగా మండల విద్యాశాఖ అధికారిగా పనిచేసిన గడ్డం వనజ ను మండల ఉపాధ్యాయుల తరఫున మంగళవారం ఘనంగా సన్మానించారు. వివిధ ప్రాథమిక పాఠశాలల, ప్రాథమికోన్నత పాఠశాలల, ఉన్నత పాఠశాలల, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చేసిన సేవలను కొనియాడారు, పాఠశాల అభివృద్ధిలో చేసిన కృషి ఎనలేనిదని ఎండిఓ రాధా కిషన్, తహసీల్దార్ సంతోష్ అన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ రేణుక, పిఆర్‌టియు మండల అధ్యక్షులు బుడ దేవానందం, ప్రధాన కార్యదర్శి నరసింహారావు, యూటీఎఫ్ అధ్యక్షులు మల్లేష్, పిఆర్‌టియు అసోసియేట్ అధ్యక్షులు కాంతయ్య, హరిచరణ్, అంబుజా రాణి, దేవరాజు, విజయ్ జిల్లా కార్యదర్శి నంబి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు రాజేందర్ గౌడ్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

సమగ్ర సర్వే... చదువులు కరువే

- నేటినుండి సమగ్ర కుటుంబసర్వే
- ఎస్టీటీ ఉపాధ్యాయులకు సర్వే విధులు

నవతెలంగాణ-ఆర్మూర్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని నిర్వహిస్తున్న ఇంటింటి కుటుంబ సర్వే నేటి నుంచి ప్రారంభం కానుంది. ప్రజల సామాజిక ,ఆర్థిక ,విద్య, ఉపాధి, రాజకీయ కుల వివరాల నమోదు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన సమగ్ర కుటుంబ సర్వే కు అధికార యంత్రాంగం సిద్ధమైంది. ఈ సర్వే పై రాష్ట్రస్థాయి శిక్షణ కార్యక్రమం సర్వే యొక్క ఉద్దేశం, లక్ష్యం తదితర అంశాలను వివరిస్తూ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ సైతం ప్రభుత్వం విడుదల చేసింది.

రెండు విభాగాలుగా సర్వే...

నేటి నుంచి చేయనున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే రెండు భాగాలుగా సాగుతుంది. మొదటి విభాగం పార్ట్ వన్ లో కుటుంబ యజమాని, సభ్యుల వ్యక్తిగత వివరాలకు సంబంధించిన ప్రశ్నలుంటాయి. రెండో విభాగంలో కుటుంబ వివరాలకు సంబంధించిన ప్రశ్నలుంటాయి .సర్వే ప్రశ్నావళిలు 75 ప్రశ్నలు ఉండగా ఇందులో 56 ప్రధాన ప్రశ్నలు కాగా, మిగతా 19 ఉప ప్రశ్నలు ఉంటాయి. కుటుంబ యజమాని వివరాలతో పాటు వృత్తికి సంబంధించిన వివరాలను సేకరిస్తారు. కుటుంబంలో ఎంతమంది సభ్యులు ఉన్నారు. ఏం పనులు చేస్తున్నారు. వివరాలు తీసుకుంటారు. విద్యార్థులైతే ఏం చదువుతున్నారు .ఏ కులానికి చెందినవారు ,ప్రభుత్వ నుండి రిజర్వేషన్లు పొందారా. ఏ కోర్సులో చేరారు.. ఒకవేళ ఉద్యోగాలు చేస్తుంటే వాటి వివరాలను తీసుకుంటారు. ప్రభుత్వ ఉద్యోగం అయితే ఆ వివరాలను ,ప్రైవేటు ఉద్యోగం చేస్తుంటే ఆ వివరాలను కూడా సేకరిస్తారు .కుటుంబ సభ్యుల్లో ఎంతమంది రిజర్వేషన్లను ఉపయోగించుకుంటున్నారు. ఎన్ని పథకాలను ఇప్పటివరకు లబ్ధి పొందారు. ఏ ఏ పథకాల ద్వారా లబ్ధి పొందారు వివరాలను తీసుకోవడంతో పాటు ఆ కుటుంబానికి సంబంధించిన రుణాల వివరాలను కూడా తీసుకుంటారు. దీంతోపాటు ఆ కుటుంబానికి సంబంధించిన వారు ఎవరైనా రాజకీయ పదవులలో ఉంటే వాటి వివరాలను నమోదు చేస్తారు. గతంలో రాజకీయ పదవులలో ఉన్న వివరాలను సేకరిస్తారు. దీంతోపాటు ఆ కుటుంబ ఆస్తుల వివరాలు,కుటుంబ యజమానికి ఎంత భూమి ఉంది ఎన్ని ఇల్లు ఉన్నాయి. అవి పక్కా ఇండ్లా, గుడిసెల వాటి వివరాలను తీసుకుంటారు. ఒకవేళ కిరాయికి ఉంటే ఆ వివరాలను సేకరిస్తారు. వ్యవసాయ భూమి ఉంటే ఎన్ని ఎకరాలు ఉందో వివరాలను సేకరిస్తారు. వాహన వివరాలు ద్విచక్ర, ట్రాక్టర్ ,లారీ, కుటుంబాలకు సంబంధించిన వారు విదేశాలలో ఉద్యోగాలు చేసిన, చదువు నిమిత్తం వెళ్లిన, రుణం తీసుకుని వెళ్లారా.. స్కాలర్షిప్ మీద వెళ్లారా.. వీటితో పాటు కుటుంబంలో ఎంతమంది ఇన్కమ్ టాక్స్ పే చేస్తున్నారు.. రిటర్న్ దాఖలు చేస్తున్నారో ఆ వివరాలను నమోదు చేసుకుంటారు. ఒక కుటుంబంలో ఉన్న వారి మొత్తం వివరాలను ఈ సర్వేలో భాగంగా సేకరించనున్నారు.



విద్యార్థుల చదువులకు దెబ్బ...

జిల్లాలోని ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఎస్జీటీ,,, ప్రధానోపాధ్యాయులకు ఈ సర్వేలో విధులను కేటాయించారు. దీంతో విద్యార్థుల చదువులు దెబ్బతినే ప్రమాదం ఉందని పలువురు విద్యావేత్తలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రాథమిక పాఠశాలలో పనిచేసే టీచర్లు ఉదయం నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పాఠశాల బోధన చేపట్టి తర్వాత సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొనాలని పాఠశాల విద్యాశాఖ సెక్రటరీ బుర్ర వెంకటేశం ఆదేశాలు జారీ చేశారు. దీంతో విద్యార్థుల చదువులకు ఆటంకాలు ఎదురయ్యే అవకాశాలు ఉన్నారు. ఉపాధ్యాయ సంఘాల, విద్యార్థి సంఘాలు, వివిధ వర్గాల నుంచి భిన్నభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల సేవలను వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణ యం తీసుకోవ డంతో మారుమూల గ్రామాల్లో పిల్లలను స్కూలుకు పంపి కుటుంబ సభ్యులు పొలం పనుల కోసం వెళ్తారు వారు తిరిగి సాయంత్రం కానీ ఇంటికి రారు. ఆ సమయంలో పిల్లలను ఇంటికి పంపించడం సరికాదని టీచర్లు, తల్లిదండ్రులు అభిప్రాయ పడుతున్నారు. గత నెలలో దసరా సందర్భంగా పది రోజుల సెలవులు ,ప్రస్తుతం మూడు వారాలపాటు ఒంటిపూట బడులు నిర్వహించడం వల్ల విద్యార్థుల చదువుపై ప్రభావం పడుతుంది. ఇదే నెల చివరివారం లేదా వచ్చే నెల మొదటి వారం న్యాస్ పరీక్ష కూడా ఉంది. జాతీయస్థాయిలో విద్యార్థుల విద్యా ప్రమాణముల నిర్ధారణ కోసం నిర్వహించే ఈ పరీక్షకు విద్యార్థులను సంసిద్ధులుగా చేయాల్సిన ఈ సమయంలో మూడు వరాలపాటు సర్వే విధుల్లో ఉపాధ్యాయులు, ఒంటి పూట కారణంగా సెలవుల్లో విద్యార్థులు ఉండడం వల్ల ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది.

జిల్లాలో సైతం...

ఇంటింటి కుటుంబ సర్వే సక్రమంగా నిర్వహించేందుకు జిల్లా అధికారులు కసరత్తు చేస్తున్నారు. 2011 సంవత్సరం జనాభా లెక్కల ప్రకారం జిల్లాలో 15 లక్షల 77, వేల 108 మంది ఉన్నారు. వీరిలో పురుషులు ఏడు లక్షల 71 వేల 449 మంది ఉండగా స్త్రీలు 8 లక్షల 5వేల 659 మంది ఉన్నారు. అధికారుల లెక్కల ప్రకారం జిల్లాలో కుటుంబ యజమానులు 3 లక్షల 69 వేల031 ఉన్నవి. కాగా ఇటీవల జిల్లాలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లతోపాటు కొత్తగా నిర్మించిన ఇండ్లను కూడా సర్వే చేయనున్నారు. జిల్లాలోని పలు నియోజకవర్గ కేంద్రాలతో పాటు మండలాల్లో సైతం సర్వే ఎన్యూమరేటర్లకు సూపర్వైజర్లకు ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలు సైతం నిర్వహించారు.

మున్సిపల్ పరిధిలో..

నేటి నుంచి ప్రారంభం కానున్న సమగ్ర కుటుంబ సర్వే కు మున్సిపల్ కమిషనర్ రాజు ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. మొత్తం మున్సిపల్ పరిధిలో 36 వార్డులు ఉన్నాయి. సుమారుగా 20వేల పైన కుటుంబాలు ఉన్నాయి. నేటి నుంచి ప్రారంభమయ్యే కుటుంబ సర్వేలో మున్సిపల్ పరిధిలో కొన్ని ఇండ్లకు స్టిక్కర్లు అతికించలేదని పలువురు తెలిపారు.

20 ఏళ్ల నుంచి గుడిసెల్లోనే..

మున్సిపల్ పరిధిలోని పెర్కిట్,మామిడిపల్లి పట్టణం లో గత 20 సంవత్సరాల నుండి కూలి పని చేసుకుంటూ గుడిసెలలో జీవిస్తున్న వారు ఎందరో ఉన్నారు.

ప్రభుత్వం మమ్మల్ని పట్టించుకోవాలి..

కోట సాయిలు, దినసరి కూలీ, మామిడిపల్లి.



గత 20 సంవత్సరాల నుండి కూలి పని చేసుకుంటూ గుడిసెలలో నివసిస్తున్నాం. ఎన్నికలు వస్తున్నాయి పోతున్నాయి. రాజకీయ నాయకుల హామీలు హామీలుగానే మిగిలిపోతున్నవి. ఈ సర్వేలోనైనా మమ్మల్ని గుర్తించి ఆదుకోవాలి .

అధికారులు శ్రద్ధ చూపాలి..

డి.పోసాని ,దినసరి కూలీ, స్థానికురాలు.



ఎన్నో సంవత్సరం నుండి గుడిసెలు వేసుకుని జీవిస్తున్నాం. స్థిరాస్తులు ,భూములు ఏమి లేవు. కూలి పనితో బ్రతుకులు వెళ్లదీస్తున్నాం. కుటుంబ సర్వేలోనైనా మమ్మల్ని గుర్తించి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలి.

అమరుడు జంపాల స్ఫూర్తితో పోరాడుదాం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

పిడిఎస్‌యూ నిర్మాత అమరుడు కామ్రేడ్ జంపాల చంద్రశేఖర ప్రసాద్ స్ఫూర్తిగా ఫాసిజం, రాజ్యహింసకు వ్యతిరేకంగా పోరాడుదాం అని వారు అన్నారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్‌యూ) నిర్మాత కామ్రేడ్ జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ 49 వర్ధంతి సందర్భంగా పిడిఎస్‌యు నగర కమిటీ, పూర్వ విద్యార్థుల నాయకత్వంలో మంగళవారం జంపాల ప్రసాద్ చదివిన ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఖిల్లా నుండి కోటగల్లి వరకు మార్నింగ్ వాక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మార్చ్‌ను పిడిఎస్‌యు పూర్వ రాష్ట్ర నాయకులు ప్రముఖ న్యాయవాది గొర్రెపాటి మాధవరావు మాట్లాడారు. జంపాల ప్రసాద్ జూనియర్ కళాశాల ఖిల్లా, అనాడు ఇంటిగ్రేటెడ్ కాలేజీగా ఉండేదని అందులో చదివాడని తెలిపారు. జార్జిరెడ్డి అమరత్వం తర్వాత పిడిఎస్యును రాష్ట్రవ్యాప్త సంఘంగా అభివృద్ధి చేసిన జంపాల ప్రసాద్ నిజామాబాద్ జిల్లా వాసియని అన్నారు. మత ఉన్మాదం జార్జి రెడ్డిని హత్య చేస్తే, రాజహింస జంపాల ప్రసాదును బలి తీసుకుందని చెప్పారు. ఈరోజు కేంద్రంలో ఉన్న ప్రభుత్వం అటు మతోన్మాదాన్ని ఇటు రాజ్య హింసను ప్రోత్సహిస్తుందని అందులో భాగంగానే అర్బన్ నక్సల్స్ పేరిట ప్రశ్నించే వారిని అంతం చేస్తుందని అన్నారు. అమాయక ప్రజలను మతం పేరుతో విభజించి ఉన్మాదాన్ని రెచ్చగొడుతుందని విమర్శించారు. వచ్చే సంవత్సరం నాటికి జంపాల ప్రసాద్ మరణించి 50 సంవత్సరాలు అవుతున్నందున ఈ సంవత్సరం పొడుగునా అమరత్వాన్ని ఎత్తి పడుతూ కార్యక్రమాలు నిర్వహించాలని జంపాల ప్రసాద్ స్ఫూర్తితో రాజ్య హింసను, ఫాసిజంను ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. మాజీ పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షుడు, న్యాయవాది వి.భాస్కర్ మాట్లాడుతూ.. విద్యార్థి అమరుల స్ఫూర్తితో విద్యారంగ సమస్యల సాధన కోసం పిడిఎస్యు నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఖిల్లా కళాశాల నుండి ప్రారంభమైన మార్నింగ్ వాక్ కోటగల్లికి చేరుకుంది. కార్యక్రమంలో పూర్వ పిడిఎస్‌యు నాయకులు పరుచూరి శ్రీధర్, జి. రమేష్, బండమీది నర్సయ్య, ఆకుల సత్యనారాయణ, గగన్ అన్వేష్, సాయినాథ్, దాసు, న్యూ డెమోక్రసీ నగర కార్యదర్శి నీలం సాయిబాబా, ఐఎఫ్టియు నగర కార్యదర్శి శివకుమార్, రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి దేశెట్టి సాయి రెడ్డి, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు ఆకుల అరుణ, అనంత, ప్రగతిశీల యువజన సంఘం జిల్లా అధ్యక్షులు వనమాల సత్యం, నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి సమగ్ర సర్వే

నవతెలంగాణ-ముప్కాల్

మండలంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కార్యక్రమంలో భాగంగా మొత్తం 40 బ్లాక్ లు ఏర్పాటు చేసినట్టు ఎంపీవో మహమ్మద్ గౌస్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 40 బ్లాక్ లకు 40 మంది ఎన్యూమరేటర్లతో పాటు 5 గురు సూపర్ వైజర్లను కేటాయించారని చెప్పారు. సమగ్ర సర్వే పనులు బుధవారం నుంచి ప్రారంభం కానున్నట్లు పేర్కొన్నారు. అందుకుగాను ప్రతి ఒక్కరూ సహకారాన్ని అందించాలని కోరారు.

రాజకీయాల్లో యువత ఉండాలి

- అందుకే డీఎస్పీ పదవికి రాజీనామా చేశా : గంగాధర్

నవతెలంగాణ నిజామాబాద్ సిటీ

రాజకీయాల్లో ప్రస్తుత యువత అనివార్యమని, ఇందుకోసమే తాను డీఎస్పీ పదవికి రాజీనామా చేసి ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిలుస్తున్నానని మాదానం గంగాధర్ అన్నారు. వ్యవస్థల్లో మార్పు రావాలని కోరుకుంటూ కూర్చుంటే రాదని, ప్రత్యక్ష ప్రయత్నం ద్వారానే అది సాధ్యమని పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి మాదానం గంగాధర్ అన్నారు. నగరంలోని ప్రెస్ క్లబ్ లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాజకీయాల్లో ప్రస్తుత యువత అనివార్యమని, ఇందుకోసమే తాను డీఎస్పీ పదవికి రాజీనామా చేసి ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిలుస్తున్నానని అన్నారు. పోలీసు అధికారిగా 26 ఏళ్లపాటు



పనిచేసిన అనుభవాన్ని ప్రజా సమస్యల పరిష్కారానికి ఉపయోగిస్తానని అన్నారు. నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో నిలుస్తున్నానని తనను ఆశీర్వదించాలని కోరారు.

1998లో సర్వీసులోకి..

జిల్లాలోని ఆర్మూర్ కు చెందిన మాదానం గంగాధర్ 1998లో 22 ఏళ్ల వయస్సులో ఎస్సైగా ఉద్యోగం సాధించారు. ప్రమోషన్ లతో డీఎస్పీ స్థాయికి చేరారు. ఆయన అందించిన అసాధారణ సేవలను గుర్తించిన ప్రభుత్వాలు కఠిన సేవా పథకం, ఉత్తమ సేవా పథకం, ముఖ్యమంత్రి సర్వోన్నత పథకాలను అందించాయి. ఇప్పటి వరకు ఆయన 200 వరకు రివార్డులు తీసుకున్నారు అని తెలిపారు..

పెన్నులు, నోట్ బుక్‌లు, బ్యాగుల పంపిణీ



పెన్నులు, నోట్‌ఉక్‌లు అందజేస్తున్న ముక్కెర దేవన్న

నవతెలంగాణ-ఏర్గట్ల

గుమ్మిర్యాల్ ప్రాథమిక పాఠశాలలో గ్రామానికి చెందిన కీర్తిశేషులు ముక్కెర గౌరవ్వ జ్ఞాపకార్థం కుమారుడు ముక్కెర దేవన్న విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లు, పెన్నులు, నోట్ బుక్‌లు, అరటి పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ ఆనంద్ రావ్, ఉపాధ్యాయులు సత్యానంద్, జ్యోతి,గౌతమి, పాల్గొన్నారు.

అమరవీరుల స్మారకసభ జయప్రదం చేయండి



మాట్లాడుతున్న దాసు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

భూమి, భుక్తి, విముక్తి కోసం, కార్మిక రాజ్యం కోసం తన నిండు ప్రాణాలను అర్పించిన అమరవీరులను స్మరిస్తూ ఈనెల 8న ఆర్మూర్ పట్టణంలో సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్లు ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి దాసు తెలిపారు. మండలంలోని తొర్లికొండ గ్రామంలో ఇప్టు ఆధ్వర్యంలో మంగళవారం భానుచందర్ అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో దాసు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం, కార్మిక హక్కుల కోసం అహర్నిశలు పోరాడి తమ జీవితాలను త్యాగం చేసిన వారి స్ఫూర్తితో ఉద్యమాలను తీవ్రం చేయాలని అన్నారు. నరేంద్ర మోడీ సర్కార్ 10 ఏళ్ల పరిపాలనలో కార్మిక హక్కులు కాలరాస్తుందని, శ్రమ దోపిడీ లేని వ్యవస్థ కోసం ప్రాణాలను అర్పించిన త్యాగధనులను స్మరిస్తూ, వారి ఆశయ సాధన కోసం ముందుకు అడుగులు వేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. సమావేశంలో ఐఎఫ్టియు నాయకులు గణేష్, శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శిశువుకు సంజీవని ముర్రుపాలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తల్లిపాలు అమృతంతో సమానమని, ఇప్పుడే పుట్టిన శిశువుకు ఆరోగ్య సంజీవిని ముర్రుపాలని, వాటిని తాగించాలని మండల ఆరోగ్య విస్తరణ అధికారి వై శంకర్ అన్నారు. మంగళవారం ఇందల్ వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అశా కార్యకర్తల నెలవారి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్ మాట్లాడుతూ... ఆశా కార్యకర్తలందరికీ కొత్త రిజిస్టర్లు అందజేశారు. ప్రతి ఒక్కరూ రిజిస్టర్లో మొదట మీ పరిధిలో గల కుటుంబల వివరాలు, వారి దిన చర్య, అర్హులైన దంపతుల రిజిస్టర్, గర్భిణీ స్త్రీల రిజిస్టర్, బాలింత సంరక్షణ రిజిస్టర్, గృహంలో నవజాత శిశువు రిజిస్టర్, గృహంలో పసిబిడ్డ సంరక్షణ రిజిస్టర్, శిశువులు, పిల్లల వ్యాధి నిరోధక టీకాలు వివరాలు, ఎస్ఎన్‌సియు సెంటర్‌కు రిఫర్ చేసిన అనారోగ్య నవజాత శిశువుల వివరాలు, ఎన్‌ఆర్సిపి రిఫర్ చేసిన శ్యామ్ మామ్ కేసుల వివరాలు, ఆరు నెలల నుండి 60 నెలల పిల్లలకు ఐరన్ టానిక్ సిరప్ మాత్రం ఇచ్చిన వివరాలు, మరణాల వివరాలను నమోదు చేసుకొవాలని సూచించారు. నెలవారి సిడి కేసుల గుర్తింపు చికిత్స ఫాలోప్, డెంగ్యూ కేసులు, మలేరియా, బోదకాలు కేసుల వివరాలు, క్షయ వ్యాధి కేసుల రిజిస్టర్, కుష్టు వ్యాధి కేసుల రిజిస్టర్, పై వివరాలన్నింటినీ ఒకే రిజిస్టర్లో తెలంగాణ ప్రభుత్వం తీసుకువచ్చిందని వివరించారు. ఈ రిజిస్టర్లు ప్రతి ఒక్క ఆశ కార్యకర్త ప్రతిరోజు తప్పకుండా నిర్వర్తించాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు దేవపాల, అక్బర్ అలీ, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



రిజిస్టర్లను అందజేస్తున్న మండల ఆరోగ్య విస్తరణ అధికారి

విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేత

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని పి ప్రీ గ్రామ ప్రైమరీ పాఠశాల , ఉన్నత పాఠశాలల విద్యార్థులకు దాత సుంకం భూషణ్ విద్యార్థులకు ఆర్థిక సహాయం మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పి . విజయ్ కుమార్, విశ్వనాథ్ ఉపాధ్యాయ బృందం, యూత్ సభ్యులు విద్యార్థులు పాల్గొన్నారు.

5
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
బుధవారం | నవంబర్ 06, 2024 | www.navatelangana.com

పాఠశాలను సందర్శించిన సెక్టోరియల్ అధికారులు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని గోలిలింగాల గ్రామంలో గల ప్రాథమికోన్నత పాఠశాలను సెక్టోరియల్ అధికారులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తరగతి గది విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారి శ్రీ వేణుగోపాల్, వెంకటేశ్వర్లు, జెడ్పిహెచ్ఎస్ పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వెంకటరామిరెడ్డి, గోలిలింగాల్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవయ్య, సిఆర్పి రాజయ్య తదితరులున్నారు.



మాట్లాడుతున్న సెక్టోరియల్ అధికారి

ధాన్యంలో చెత్తను తొలగించాలి

- కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి

నిర్దిష్టమైన తేమశాతం ఉన్న ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వి.విక్టర్ అన్నారు. ధాన్యంలోని చెత్తను తొలగించాలని అన్నారు. మంగళవారం రాజంపేట్, లింగంపల్లి, కామారెడ్డి మండలాల్లోని రాజంపేట్, కొండాపూర్, గుండారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేస్తున్నట్టు తెలిపారు. నిర్దిష్ట తేమశాతం ఉండాలని అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని లారీల్లో ఆయా రైస్ మిల్లులకు తరలించాలని సెంటర్ ఇన్చార్జిలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, రైతులు పాల్గొన్నారు.



సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

నవతెలంగాణ-కామారెడ్డి

నేటి నుంచి ప్రారంభమయ్యే సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల గణన సర్వే పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. మంగళవారం కామారెడ్డి పట్టణంలోని కళాభారతిలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో చేపట్టే సర్వే పక్కాగా ఉండాలని, ఏ ఒక్క ఇల్లు, వ్యక్తి కూడా తప్పిపోకుండా పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. ప్రభుత్వం జారీచేసిన బుక్లెట్స్ ఆధారంగా గణన చేపట్టాలని తెలిపారు. ఇప్పటికే ఎన్యుమరేటర్ల నియామకాలు పూర్తిచేశామని, ప్రతీ మండల కేంద్రం, మున్సిపల్ కేంద్రాల్లో శిక్షణ కార్యక్రమాలు పవార్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఇస్తున్నట్టు వివరించారు. జిల్లాలో చేపట్టే సర్వే తప్పులు లేకుండా పూర్తి సమాచారంతో సేకరణ జరగాలని అన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే ముందే నివృత్తి చేసుకోవాలని తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమాల్లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, సీపీఓ రాజారాం, ఆయా మండల తహసీల్దార్, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్

సరిహద్దులో తనిఖీలు

నవతెలంగాణ-మద్నూర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సన్న వడ్లకు రూ.500 బోనస్ ప్రకటించినందున ఇతర రాష్ట్రాల నుంచి వరి ధాన్యం అక్రమంగా తెలంగాణ రాష్ట్రంలోకి రాకుండా రాష్ట్ర సరిహద్దు అయిన మద్నూర్ మండలంలోని సలాబత్పూర్ సమీపంలోని మహారాష్ట్ర బార్డర్లో చెక్‌పోస్టు వద్ద అధికారులు పకడ్బందీగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం రాష్ట్ర సరిహద్దులో ఇతర రాష్ట్రాల నుంచి తెలంగాణలోకి వచ్చే వాహనాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాజు, ఏఈఓ భజన, రికార్డు అసిస్టెంట్, అదేవిధంగా ఎక్సైజ్ శాఖ సిబ్బంది తనిఖీలో పాల్గొన్నారు



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

సామాజిక, ఆర్థిక, కుల గణనకు సర్వం సిద్ధం



శిక్షణలో మాట్లాడుతున్న అధికారి

నవతెలంగాణ-భిక్కనూర్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన సామాజిక, ఆర్థిక కులగణనకు మండలంలో సర్వం సిద్ధమైంది. మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక రైతు వేదికలో ఎంపీడీవో రాజ్ కిరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు వెంకటరమణ, మోహన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. సమగ్ర సర్వే ఫారంలో ఉన్న విషయాలను పకడ్బందీగా నింపాలన్నారు. మండలంలో మొత్తం 15,114 ఇండ్లు ఉన్నాయని, వారిని సర్వే చేసేందుకు పదిమంది సూపర్వైజర్లను, 104 మంది ఎన్యుమరెటర్లను ఎంపిక చేసినట్లు వారికి కేటాయించిన గ్రామాలలో వారు సర్వే నిర్వహిస్తారని, ప్రజలందరూ సామాజిక ఆర్థిక సర్వేకు ఇంటికి వచ్చే అధికార్లకు సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో శివప్రసాద్, మండల ప్రత్యేక అధికారిని రజిత, అధికారులు, ఇరిగేషన్ డిఈ ఆనందం, మిషన్ భగీరథ ఏఈ శ్రీనివాస్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫోన్‌లో నిమగ్నమైన ఓ అధికారిని

కాగా కుల గణన సమావేశంలో అధికారులకు శిక్షణ నిర్వహిస్తుంటే ఓ అధికారిని ఫోన్‌లో నిమగ్నమవ్వడం చర్చనీయాంశం అయింది. అధికారులు సమావేశంలో చెప్పిన విధంగా సర్వే నిర్వహించి పూర్తి వివరాలు నమోదు చేయాలని ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక కుల గణన కార్యక్రమంలో సదరు అధికారిని తనకేమీ పట్టనట్టుగా ఫోన్‌లో నిమగ్నమవడం చర్చానీయంశంగా మారింది. సమావేశం కంటే ఫోన్‌కు ప్రాముఖ్యత ఇస్తున్న అధికారినిపై ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచిచూడాల్సి ఉంది.

ఐమాస్ట్ లైట్లు ఏర్పాటు

- నవతెలంగాణ కథనానికి స్పందన

నవతెలంగాణ-లింగంపేట్



మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో గ్రామపంచాయతీ అధికారులు ఐమాస్ట్ లైట్లను మంగళవారం ఏర్పాటు చేశారు. గత కొన్ని నెలలుగా లింగంపేట్ అంబేద్కర్ చౌరస్తా నుంచి పాఠశాల వరకు ఎల్లారెడ్డి కామారెడ్డి ప్రధాన రహదారికి ఇరువైపులా విద్యుత్ దీపాలు లేకపోవడంతో 'ఆదర్శం అంధకారం' అనే శీర్షికన సోమవారం నవతెలంగాణ దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీంతో అధికారుల స్పందించారు. అంబేద్కర్ చౌరస్తా ప్రధాన కూడలి వద్ద ఐమాస్ట్ లైట్లను ఏర్పాటు చేశారు. దీంతో లింగంపేట్ మండల కేంద్రం చీకటి తొలగి.. విద్యుత్ కాంతులతో కళకళలాడుతోంది.

నవతెలంగాణ ఎఫెక్ట్

2వ ఏఎన్ఎంల రాష్ట్ర ప్రథమ మహాసభలను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-బోధన్

రెండవ ఏఎన్ఎంల రాష్ట్ర ప్రథమ మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం రెండవ ఏఎన్ఎంలు పెగాడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహాసభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రెండవ ఏఎన్ఎంల యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా కార్యదర్శి సంధ్యారాణి మాట్లాడుతూ రెండవ ఏఎన్ఎంలందరిని ప్రభుత్వం రెగ్యులర్ చేయాలని, రెగ్యులర్ చేసే వరకూ 100శాతం గ్రాస్ శాలరీని అమలు చేయాలని, పరీక్ష ద్వారానే రెగ్యులర్ చేయాల్సివస్తే 5600 పోస్టులను మంజూరు చేసి ఆంధ్రప్రదేశ్‌లో చేసిన విధంగా డిపార్టుమెంటల్ పరీక్షల ద్వారా రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. రెగ్యులర్ అయ్యేంతవరకు రెండవ ఏఎన్ఎంల కుటుంబ సభ్యులకు 10 లక్షల హెల్త్ ఇన్సురెన్స్‌తో పాటు 10 లక్షల లైఫ్ ఇన్సూరెన్స్‌ను ప్రభుత్వమే భరించాలని, యాప్‌లను మెర్జ్‌చేసి పని ఒత్తిడిని తగ్గించాలని, ఎ.ఎన్.సి టార్గెట్లతో పాటు ఎన్.సి.డీల నుండి ఏఎన్ఎంలను మినహాయించాలన్నారు. ట్రాన్స్‌ఫర్లకు అవకాశం కల్పించాలని, యుపిహెచ్సీలో కూడా సబ్ సెంటర్‌కు 5000 జనాభా కుదించి ఆశ పోస్టులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రెండో ఏఎన్ఎం దురదృష్టవశాత్తు మరణిస్తే వారి కుటుంబ సభ్యులకు ఆరు నెలలలోపు అర్హతను బట్టి కారుణ్య నియమాకం కింద కాంట్రాక్ట్ బేసిస్‌లో ఉద్యోగాన్ని ఇవ్వాలన్నారు. అనంతరం పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సమత, సావిత్రి, సరస్వతి, స్వరూపరాణి, జ్యోతి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పలువురు

రాష్ట్రస్థాయి ఖోఖో క్రీడల్లో ఆదిలాబాద్ ఫస్ట్

- రెండో, మూడో స్థానాల్లో రంగారెడ్డి, నిజామాబాద్

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని పోసానిపేటలో 3 రోజులుగా నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్ 14, 68 క్రీడా పోటీలు మంగళవారం ముగిశాయి. ఉమ్మడి పది జిల్లాల నుంచి 10 జట్లు పాల్గొనగా మొదటి స్థానంలో ఆదిలాబాద్ జట్టు నిలువగా, రన్నర్‌ఫగా రంగారెడ్డి, మూడవ స్థానంలో నిజామాబాద్ నిలిచాయి. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఆటలతో శారీరక ధృఢత్వం, మానసిక ఉల్లాసం, స్నేహ బంధాలు బలపడతాయని అన్నారు. ఆటల్లో గెలుపోటములు సహజమని, విజయం పొందిన వారు మరింత నైపుణ్యతను పెంచుకోవాలని, ఓటమి చెందినవారు ఓటమి పాఠాలను విశ్లేషించి భవిష్యత్తు విజయాలకు కృషి చేయాలని సూచిం చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర సీనియర్ నాయకులు వడ్డేపల్లి సుభాష్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి, మాజీ సర్పంచ్ గీ రెడ్డి మహేందర్ రెడ్డి, నా రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, పోతుల భాస్కర్ రెడ్డి, గాండ్ల ప్రవీణ్, సుద్దాల లింగం, బెస్త ఆనంద్, ఎంఈఓ ఆనంద్ రావు, ప్రధానోపాధ్యాయులు శ్రీని వాస్, వ్యాయామ ఉపాధ్యాయులు సాయి మౌర్య, ఆయా జిల్లాల పి ఈ టి లు, ఉపాధ్యాయులు, క్రీడాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



బహుమతి అందజేస్తున్న పలువురు

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య

నవతెలంగాణ-తాడ్వాయి

ఆర్థిక ఇబ్బందులతో ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన మండలంలోని దేవాయిపల్లి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన టేకుల సాయిరెడ్డి (50) ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య టేకుల పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. మృతునికి కుమారుడు నరేష్ ఉన్నాడు.

యువకుడు అదృశ్యం

- కేసు నమోదు

నవతెలంగాణ-ఎడపల్లి



యువకుడు అదృశ్యమయ్యాడు. ఈ ఘటన మండలంలోని జైతాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన కంటే సత్యసాయి (22) అనే యువకుడు సోమవారం రాత్రి సుమారు 8 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో అతని స్నేహితుల, బంధువుల ఇండ్లల్లో వెతికినా అచూకీ లభించలేదు. దీంతో తండ్రి కంటే వెంకటేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆరు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

నవతెలంగాణ-బిచ్కుంద

మంజీర పరివాహక ప్రాంతమైన హస్గుల్ గ్రామ శివారు నుండి అనుమతులు లేకుండా రాత్రి సమయాల్లో ఇసుకను ట్రాక్టర్‌ల ద్వారా తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ శంకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. అర్ధరాత్రి సమయంలో హస్గుల్ గ్రామానికి చెందిన కొందరు ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నారనే పక్కా సమాచారం మేరకు పెట్రోలింగ్ నిర్వహించి ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు. ఎవరైనా అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే ట్రాక్టర్ల యజమానులపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

మీసేవ తెలంగాణ రాష్ట్ర ఫెడరేషన్ జిల్లా అధ్యక్షునిగా కాముని సునీల్ కుమార్

నవతెలంగాణ-తాడ్వాయి



మీ సేవ తెలంగాణ రాష్ట్ర ఫెడరేషన్ కామారెడ్డి జిల్లా అధ్యక్షునిగా మండల కేంద్రానికి చెందిన కాముని సునీల్ కుమార్ ఎన్నికైనట్లు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివలింగ గౌడ్ తెలిపారు. ఈ ఎన్నిక హైదరాబాద్‌లోని ఆర్టీసీ కళాభవన్‌లో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. జిల్లాలోని మీసేవ కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు వచ్చినా తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

గ్రామ అభివృద్ధి కోసం కృషి చేస్తా

నవతెలంగాణ-దోమకొండ

మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఈవో యాదగిరి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు సీతారాం మధు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కదిరే గోపాల్‌రెడ్డి నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానాన్నరు. నాయకులు అబ్రబోయిన రాజేందర్, మంగళపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించాలి

- ప్రతి ఇంటికి స్టికర్ తప్పనిసరి
- డీఎల్పీ సురేందర్

నవతెలంగాణ-లింగంపేట్

ఇంటింటికి వెళ్లి కుటుంబ యజమాని వివరాలను సేకరించాలని డిఎల్పీఓ సురేందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో కులగణన సర్వే సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ప్రతి కుటుంబానికి స్టిక్కర్ అంటించాలని అనంతరం కుటుంబ యజమాని వివరాలను సేకరించాలని అన్నారు. క్రమం తప్పకుండా ప్రతి కుటుంబానికి నేరుగా వెళ్లాలన్నారు. ఇంటింటికి వెళ్లి కుటుంబ వివరాలు సేకరిస్తేనే పూర్తి వివరాలు అందుతాయన్నారు. ముందస్తుగా కుటుంబ యజమాని వివరాలు సేకరించి ఆ ఇంటికి స్టిక్కర్‌ని అంటించాలన్నారు. అనంతరం నివేదికను మండల స్థాయి అధికారులకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నరేష్, ఎంపిఓ మలహరి, ఎంఈఓ షౌకత్ అలీ తదితరులున్నారు.



మాట్లాడుతున్న డీఎల్పీవో

మత్తు పదార్థాలకు యువత బానిస కావకాకుండా చూడాలి

నవతెలంగాణ-భిక్కనూర్

మత్తు పదార్థాలకు యువత బానిస కాకుండా చూడాలని మెడికల్ అధికారి దివ్య తెలిపారు. మంగళవారం పట్టణ కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా డే సందర్భంగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బేటి బచావో బేటి పడావో అంటూ ఆడపిల్లల ఆవశ్యకతను, వారి ప్రాముఖ్యతను వివరించాలని, ఎవరు కూడా తమ పరిధిలో ఆడపిల్లలు ఉన్నారని గర్భవిచ్చితి చేసుకోకుండా చూడాలని ఆశాలకు సూచించారు. యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా అవగాహన కల్పించాలని అన్నారు. టొబాకో ఫ్రీ స్కూల్ అంటే పాఠశాల పరిధిలో చుట్టుపక్కల ఎక్కడ కూడా బీడీ సిగరెట్లు గంజాయి మొదలైనవి అమ్మకుండా చూడాలని, విద్యార్థులు వాటికి అలవాటు పడకుండా అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం ఆశ కార్యకర్తలకు ప్రభుత్వం అందజేసే రిజిస్టర్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఓ వెంకటరమణ, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు ఉన్నారు.

సారంగపూర్ జైలులో మెగా వైద్య శిబిరం



వైద్య శిబిరంలో పాల్గొన్న జైలు అధికారులు

నవతెలంగాణ-ఎడపల్లి

నిజామాబాద్ రూరల్ పరిధిలోని సారంగాపూర్ జైల్లో మెగా వైద్య ఆరోగ్య శిబిరాన్ని వైద్యులు నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం రాత్రి శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జైల్లో ఉన్న ఖైదీలకు ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యులు శ్రీకాంత్, తేజ, రాజ్‌కుమార్ వివరించారు. అలాగే జైల్లో పనిచేసే సిబ్బందికి కూడా వైద్య ఆరోగ్య పరీక్షలను నిర్వహించారు. ఆరోగ్య పరీక్షలు చేయడం వల్ల ఖైదీలతో పాటు, సిబ్బందికి మనసు ప్రశాంతత ఆరోగ్యంగా ఉంటారని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యులు ప్రత్యూష, పిఎంఓఓ మల్లయ్య, మధుకర్, పోలీస్ అధికారులు, పోలీసు సిబ్బంది, వైద్య ఆరోగ్య కేంద్రం ఆస్పత్రి ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ డిప్యూటేషన్లను వెంటనే రద్దు చేయాలి

- భారతీయ విద్యార్థి మోర్చా రాష్ట్ర కార్యదర్శి జీవియం విఠల్

నవతెలంగాణ-కామారెడ్డి

అక్రమ డిప్యూటేషన్లను వెంటనే రద్దు చేయాలని, గతంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తే రద్దు చేశారని జిల్లా విద్యాశాఖ అధికారి మళ్లీ డిప్యూటేషన్లను ఇవ్వడం సిగ్గుచేటని భారతీయ విద్యార్థి మోర్చ (బివిఎం) రాష్ట్ర కార్యదర్శి జీవియం విఠల్ డిమాండ్ చేశారు. మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ స్కూళ్లలో పనిచేస్తున్న కొంత మంది ఉపాధ్యాయులు కావాలని, వారికి కావాల్సిన చోటకు డిప్యూటేషన్లను జిల్లా విద్యాశాఖ అధికారి సహకారంతో వేసుకుంటున్నారన్నారు. గతంలో ఇదే విషయమై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తే కొన్ని డిప్యూటేషన్లను జిల్లా అధికారికి రద్దు చేయాలని కోరామని, అందులో ఒకటి రెండు మాత్రమే రద్దుచేసి మళ్లీ అదేవిధంగా ఉపాధ్యాయులకు డిప్యూటేషన్ ఇస్తున్నారని తెలిపారు. ఈ డిప్యూటేషన్‌తో ప్రభుత్వ పాఠశాలలలో చదువుకుంటున్న పిల్లలు చదువుకు దూరమయ్యే అవకాశం కనిపిస్తుందన్నారు. పిల్లలు ఉన్న పాఠశాలలో విద్యాబోధన చేయాల్సిన ఉపాధ్యాయులు.. పిల్లలు తక్కువ ఉన్న పాఠశాలలకు వారికి భారం కాకుండా చూస్తూ దూరప్రాంతాల నుంచి రావడానికి ఇబ్బందికరంగా ఉండడం వలన డిప్యూటేషన్ తీసుకుంటున్నారన్నారు. ఈ డిప్యూటేషన్ పూర్తిగా విరుద్ధంగా జరుగుతున్నాయని, చాలామంది ఉపాధ్యాయులు సమయపాలన పాటించకుండా.. ఇష్టం వచ్చిన టైంలో పాఠశాలకు వెళ్లి వస్తున్నారని ఆరోపించారు. విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయులు రియల్ ఎస్టేట్, వ్యాపారాలు, బిజినెస్‌లు చేస్తూ ప్రభుత్వ విద్యా వ్యవస్థను గాలికి వదిలేస్తున్నారని తెలిపారు. కలెక్టర్ వెంటనే స్పందించి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రవితేజ, జిల్లా ఉపాధ్యక్షులు అర్బస్ ఖాన్, ఇంచార్జ్ బుల్లెట్, నాయకులు శివ, శ్రావణ్, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహాన్ని అందించిన ఆర్కిడ్స్ పాఠశాల చైర్మన్

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆర్కిడ్స్ పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాన్ని పాఠశాల ప్రిన్సిపాల్, చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 15 రోజులకు ఒకసారి ఒక క్లాస్‌ను సందర్శించి ఆ క్లాసులో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులను గుర్తించి వారికి నగదు ప్రోత్సాహకాన్ని అందించనున్నట్లు వివరించారు. దీని ద్వారా తోటి విద్యార్థులు మంచి క్రమశిక్షణ కలిగి, విద్యను అభ్యసించడంలో చురుకుదనం ప్రదర్శిస్తారని అన్నారు. మంగళవారం ఐదవ తరగతి పికాక్ సెక్షన్‌ను సందర్శించి అందులో తాను అడిగిన ప్రశ్నలకు తడబడకుండా సమాధానాలు చెప్పిన రిషి, అమూల్యాలకు నగదు ప్రోత్సాహాన్ని అందించినట్టు తెలిపారు.